విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న

ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక

తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





| హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 202 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జనవరి 2025 | వెల : రూ 10/- |
|---|---|---|---|---|---|




విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక




హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 202 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జనవరి 2025 | వెల : రూ 10/-



## ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

- ఐదుగురు మావోయిస్టులు మృతి
- రక్తంతో తడుస్తున్న దండకారణ్యం

రాయ్‌పూర్:
ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్లు కొనసాగుతున్నాయి. బీజాపూర్ జిల్లాలో ఆదివారం ఉదయం భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఐదుగురు మావోయిస్టులు మరణించారు. ఇంద్రావతి నేషనల్ పార్క్ ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో ఆదివారం

-మిగతా 3 లో




# ఎన్నికలప్పుడే రాజకీయాలు

### పార్టీలు వేరైనా రాష్ట్ర ప్రయోజనాలే మిన్న

- కేంద్రాన్ని ఒప్పించి అభివృద్ధి ప్రణాళికలకు అనుమతులు ఇప్పించండి
- విద్యార్థి రాజకీయాలను ప్రోత్సహించాలి
- అక్కడి నుంచే నాయకులు పుట్టుకురావాలి
- ఉనిక పుస్తకావిష్కరణ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్
ఎవరు ఏపార్టీలో ఉన్నా రాష్ట్ర ప్రయోజనాల వద్దకు వచ్చేసరికి ఏకం కావాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తమిళనాడు నుంచి ఈ సంప్రదాయాన్ని మనం అందిపుచ్చుకోవాలని చెప్పారు. జల్లికట్టు విషయంలో ఇబ్బంది వస్తే, పార్టీలకు అతీతంగా అక్కడి రాజకీయనేతలు అంతా ఐక్యమై సమస్యను పరిష్కారం చేసుకున్నారని గుర్తుచేశారు. ఆ రాష్ట్రం నుంచి 39 మంది ఎంపీలు

-మిగతా 3 లో



## రాష్ట్రాన్ని రావణకాష్టం చేస్తున్నారు

- రైతుల్ని ఈ ప్రభుత్వం నట్టేట ముంచింది :మాజీ మంత్రి ,ఎమ్మెల్యే హరీశ్‌రావు
- రాష్ట్రపతి పాలన పెట్టాలని కేంద్రానికి సూచన

సిద్ధిపేట
రైతుల్ని ఈ ప్రభుత్వం నట్టేట ముంచిందని, సిగ్గులేకుండా సంబరాలు చేయమంటున్నారని, రేవంత్ రెడ్డి నుంచి రాహుల్ వరకు కాంగ్రెస్ ఇచ్చిన ఒక్క హామీ నిలబెట్టుకోలేదని, బహిరంగ చర్చకు తాను

-మిగతా 3 లో



## ఐదేండ్లలో పాలమూరు సమగ్రాభివృద్ధి

- 12 లక్షల ఎకరాలకు నీళ్లు పారిస్తాం రూ. లక్ష కోట్లు ఖర్చు చేస్తాం
- భూసేకరణ చట్టాన్ని తుంగలో తొక్కిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం
- నాగర్‌కర్నూల్ జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మహబూబ్‌నగర్
పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఐదేండ్లలో పాలమూరును సమగ్రాభివృద్ధి

-మిగతా 3 లో



## రైతు భరోసా మార్గదర్శకాలు విడుదల

### - 26 నుంచి ప్రారంభం

హైదరాబాద్
సంక్రాంతి పండుగకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు తీపికబురు అందించింది. రైతు భరోసా పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేసింది. ఈనెల 26 నుంచి రైతు భరోసా పథకాన్ని అమలు చేయనున్నట్లు ఈమేరకు ఆదివారం వ్యవసాయ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. రైతు భరోసా పథకం కింద పంట పెట్టుబడి సహాయాన్ని సంవత్సరానికి ఎకరాకు రూ.12వేలు ఇస్తున్నట్లు పేర్కొంది. భూభారతి (ధరణి) పోర్టల్‌లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమి విస్తీర్ణం ఆధారంగా పట్టాదారులకు

-మిగతా 3 లో



## కౌశిక్ రెడ్డి VS సంజయ్..

- అధికారిక కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, సంజయ్‌ల మధ్య వాగ్వాదం
- దుర్భాషలాడుకుంటూ ఒకరినొకరు తోసుకున్న వైనం
- అడ్డుకున్న మంత్రులు, సహచర ఎమ్మెల్యేలు..
- కౌశిక్‌రెడ్డిని బలవంతంగా బయటకు పంపిన పోలీసులు
- రసాభాసగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా రివ్యూ మీటింగ్

కరీంనగర్
సంక్షేమ పథకాల అమలుపై కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమీక్షాసమావేశం రసాభాసగా మారింది. జగిత్యాల ఎమ్మెల్యే

-మిగతా 3 లో

## స్వల్పదూరంలో స్పేడెక్స్ ఉపగ్రహాలు

### -ఇస్రో ప్రకటన



శ్రీహరికోట
నింగిలో డాకింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రయోగించిన స్పేడెక్స్ ఉపగ్రహాలు అత్యంత సమీపానికి చేరుకున్నాయని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ప్రకటించింది. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు పెట్టింది. తాజాగా వీటిని 15 మీటర్ల సమీపానికి తీసుకొచ్చి..

-మిగతా 3 లో

## మాజీ ఎంపీ మందా జగన్నాథం మృతి

- ఆదివారం రాత్రి 7.40 గంటలకు మరణించినట్టు నిమ్స్ వైద్యులు ధృవీకరణ



హైదరాబాద్
నాగర్ కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథం (72) అనారోగ్యంతో కన్నుమూశారు. డయాబెటిస్, హైపర్‌టెన్షన్, క్రానిక్ కిడ్నీ డిసీజ్ తదితర మల్టీపుల్ వ్యాధులతో బాధపడుతున్న ఆయన గత నెల 22న నిమ్స్‌లో చేరారు. మొదట్లో ఆయన శరీరం వైద్యానికి సహకరించినా ఆ తర్వాత

-మిగతా 3 లో

## ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఎస్ జైశంకర్



వాషింగ్టన్:
అమెరికా అధ్యక్షుడిగా మరోమారు విజయం సాధించిన డోనాల్డ్ ట్రంప్ జనవరి 20న అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయనున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి భారత్ తరపున కేంద్ర మంత్రి ఎస్ జైశంకర్ హాజరుకానున్నారు. భారత విదేశాంగ శాఖ ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ పర్యటన సందర్భంగా.. జైశంకర్ అమెరికా కొత్త పరిపాలనాధికారులతో పాటు వివిధ దేశాల అధినేతలతో చర్చల్లో పాల్గొనే అవకాశం ఉన్నట్టు వివరించింది. గతేడాది నవంబర్‌లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్‌ను రిపబ్లికన్ పార్టీ నేత డోనాల్డ్ ట్రంప్ ఓడించి.. ఘన విజయం సాధించారు. జనవరి 20న అమెరికా 47వ నూతన అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి అమెరికా క్యాపిటల్ భవనంలోని వెస్ట్ ఫ్రంట్ ప్రాంతం వేదిక కానున్నది. ఈ కార్యక్రమానికి భారీఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రపంచ దేశాల అధినేతలు ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరుకానున్నట్టు సమాచారం.ఐ

## మైనార్టీ డిక్లరేషన్ అమలెన్నడు..?

**– బడ్జెట్‌లో రూ.7 వేల కోట్లు కేటాయిస్తే.. హామీల అమలేది : ఎమ్మెల్సీ కవిత**



**–కంఠేశ్వర్**
'గద్దెనెక్కడం కోసం రేవంత్ సర్కారు అమలుకు నోచని హామీలను ఇచ్చింది. మైనార్టీల కోసమని బడ్జెట్‌లో రూ.7 వేల కోట్లు పెట్టామని చెబుతున్న రేవంత్ సర్కార్.. మైనార్టీలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదు' అని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మైనార్టీ యువతీలకు స్కూటిలతో పాటు షాదీ ముబారక్ పథకం కింద తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచిందని ఇప్పటికీ అమలుకు నోచుకోకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో వందల గురుకులాలను కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిందని అందులో మైనార్టీ విద్యార్థుల కోసం టిమ్రీస్ ను నెలకొల్పామని ఇప్పుడు అక్కడ నెలకొన్న పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నారు. నిజామాబాద్ అర్బన్ నుంచి ఎమ్మెల్యేగా షబ్బీర్‌అలీ పోటీ చేసి ఓడిపోయినప్పటికీ ఇంచార్జిగా కొనసాగుతున్నా ఇక్కడ ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేష్ గుప్త, బాజిరెడ్డి గోవర్ధన్, బోధన్ ఇంచార్జి అయేషాఫాతిమా, నగర మేయర్ నీతూ కిరణ్, మాజీ జడ్పీ చైర్మన్ విఠల్ రావు, నగర బీఆర్ఎస్ మైనార్టీ అధ్యక్షులు ఇమ్రాన్ షెహజాజ్, మాజీ జడ్పీటీసీ జగన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని రేసు నుంచి తప్పుకుంటున్నా

**అనితా ఆనంద్**



**ఒట్టావా**
కెనడా ప్రధాని రేసు నుంచి తప్పుకుంటున్నట్టు అనితా ఆనంద్ ప్రకటించారు. తాను లిబరల్ పార్టీ ఆఫ్ కెనడా తదుపరి నాయకుడి రేసు నుంచి వైదొలుగుతున్నానని ఆదివారం ఆమె ఓ లేఖలో ప్రకటించారు. ఓక్విల్లే పార్లమెంటు ఎంపీగా తిరిగి ఎన్నికవ్వాలని కోరుకోవడం లేదని పేర్కొన్నారు. తదుపరి ఎన్నికల వరకు పబ్లిక్ ఆఫీస్ హోల్డర్‌గా తన బాధ్యతలను నిర్వర్తిస్తానని ఆ లేఖలో ప్రకటించారు. దేశానికి, సమాజానికి అనేక రూపాల్లో సేవ చేయవచ్చు. తమ లిబరల్ పార్టీ కోసం, ఓక్విల్లే కోసం, అన్నిటికంటే కెనడా కోసం తాను ఇక్కడ ఉంటానని సోషల్ మీడియా ఎక్స్‌లో పేర్కొన్నారు. పార్లమెంట్ సభ్యురాలిగా లిబరల్ టీమ్‌లోకి తనను స్వాగతించినందుకు, కీలకమైన క్యాబినెట్ పోర్ట్‌ఫోలియోలను అప్పగించినందుకు ప్రధాని ట్రూడోకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు ప్రకటించారు. కెనడా హౌస్ ఆఫ్ కామన్స్‌లో, తమకు ప్రాతినిథ్యం వహించడానికి తనను ఎంపిక చేసినందుకు ఓక్విల్లే ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. అధికార లిబరల్ పార్టీ కొత్త నేతను ఎన్నుకున్న తర్వాత కెనడా ప్రధాని పదవికి రాజీనామా చేస్తానని జస్టిన్ ట్రూడో ప్రకటించడంతో ప్రధాని రేసులో అనితా ఆనంద్ పేరు తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆమె కెనడా రవాణా శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.


# గణతంత్ర దినోత్సవ ముఖ్య అతిథిగా ఇండోనేషియా అధ్యక్షుడు



**న్యూఢిల్లీ:** ఈ ఏడాది గణతంత్ర దినోత్సవానికి ముఖ్య అతిథిగా ఇండోనే షియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాం టో హాజరయ్యే అవకాశము న్నట్టు పలు మీడియా వర్గాలు వెల్లడిస్తున్నాయి. 73 ఏండ్ల మాజీ ఆర్మీ జనరల్ సుబియాం టో 2024 అక్టోబర్‌లో ఇండోనేషియా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించా రు. ఈ పర్యటనలో ఆయన ఇరుదేశాల సంబంధాలపై ప్రధాని మోడీతో విస్తృత చర్చలు జరిపే అవకాశం ఉన్నట్టు సంబంధిత వర్గాలు వివరించాయి. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.గతేడాది ప్రబోవో.. భారత ప్రధాని మోడీకి ఫోన్‌కాల్ చేసి.. ఇరుదేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే మార్గాలపై చర్చించారు. నవంబర్‌లో బ్రెజిల్‌లోని రియో డి జనిరోలో జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సులో ప్రబోవో ప్రధాని మోడీ, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో వాణిజ్యం, ఆరోగ్యం, భద్రత వంటి రంగాలలో సహకారంపై చర్చలు జరిపారు. 1950 నుంచి భారత్ మిత్ర దేశాల నేతలను గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆహ్వానించడం సంప్రదాయంగా వస్తోంది. 1952, 53, 66ల్లో మాత్రమే విదేశీ అతిథులు లేకుండా రిపబ్లిక్‌డే వేడుకలు నిర్వహించారు. 2007లో పుతిన్(రష్యా), 2008లో నికోలస్ సర్కోజీ(ఫ్రాన్స్), 2015లో బరాక్ ఒబామా (అమెరికా), 2016లో ఫ్రాన్స్‌యిస్ హౌలన్ (ఫ్రాన్స్)లు అతిథులుగా హాజరయ్యారు. 2021లో నాటి బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్‌ను చీఫ్ గెస్ట్‌గా ఆహ్వానించారు. కానీ, కోవిడ్ కేసులు పెరగడంతో ఆయన పర్యటన రద్దైంది. 2018లో ఆసియాన్ దేశాల అధినేతలను గణతంత్ర దినోత్సవానికి ఆహ్వానించారు. 2023లో ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫతా అల్ సిసి ముఖ్య అతిథిగా హాజరవ్వగా.. 2024 గణతంత్ర వేడుకలకు భారత ప్రభుత్వం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానియేల్ మక్రాన్ ను ఆహ్వానించింది.

# సీఐఏకి అందుబాటులో వాట్సాప్ సందేశాలు


**– మెటా సీఈఓ జుకర్‌బర్గ్**



**వాషింగ్టన్**
సీఐఏతో సహా అమెరికా అధికారులు, వినియోగదారుల పరికరాల్లోకి రిమోట్‌గా లాగిన్ అవ్వడం ద్వారా వాట్సాప్ సందేశాలను చదవగలరనీ, ప్లాట్‌ఫారమ్ ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్(రక్షణ వ్యవస్థ)ను సమర్థవంతంగా దాటవేస్తారని మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ అంగీకరించారు. వాట్సాప్ ఎన్‌క్రిప్షన్ మెటా సందేశ కంటెంట్‌ను వీక్షించకుండా నిరోధించినప్పటికీ, అది వినియోగదారు ఫోన్‌కు భౌతిక యాక్సెస్ నుంచి రక్షించదని శుక్రవారం జో రోగన్ ఎక్స్ పీరియన్స్ పాడ్‌కాస్ట్ లో మాట్లాడుతూ జుకర్‌బర్గ్ వివరించారు. రష్యన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఇంటర్వ్యూను ఏర్పాటు చేయాలనే టక్కర్ కార్ల్సన్ అన్వేషణ గురించి రోగన్ అడిగినప్పుడు ఆయన ఇలా వ్యాఖ్యానించారు. గతేడాది ఫిబ్రవరిలో, మూడు సంవత్సరాల విఫల ప్రయత్నాల తర్వాత పుతిన్‌తో మాట్లాడటంలో విజయం సాధించడం గురించి మాట్లాడుతూ, కార్ల్సన్ తన ప్రయత్నాలను నిలిపివేసినందుకు అమెరికా అధికారులను, అంటే నేషనల్ సెక్యూరిటీ ఏజన్సీ(ఎన్ఎస్ఏ), సీఐఏలను నిందించారు. కార్ల్సన్ ప్రకారం.. ఏజెన్సీలు అతని సందేశాలు, ఈమెయిల్‌లను ట్యాప్ చేయడం ద్వారా అతనిపై నిఘా పెట్టాయి. అతని ఉద్దేశాలను మీడియాకు లీక్ చేశాయి. ఇది మాస్కో అతనితో మాట్లాడకుండా "భయపెట్టింది". సందేశాలను రక్షించాల్సిన ఎన్‌క్రిప్షన్ రక్షణ చర్యలను పరిగణ నలోకి తీసుకుంటే ఇది ఎలా జరిగిందో వివరించా లని రోగన్ జుకర్‌బర్గ్ ను అడిగారు. "ఎన్‌క్రిప్షన్ చేసే పని నిజంగా మంచిది. ఎందుకంటే సేవను నడుపు తున్న కంపెనీ దానిని చూడకుండా చేస్తుంది. కాబట్టి మీరు వాట్సాప్ ఉపయోగిస్తుంటే, మెటా సర్వర్‌లు ఆ సందేశంలోని విషయాలను చూసే అవకాశం లేదు" అని జుకర్‌బర్గ్ అన్నారు. ఎవరైనా మెటా డేటాబేస్‌లను హ్యాక్ చేసినప్పటికీ, వారు వినియోగ దారుల ప్రయివేట్ టెక్ట్స్ లను యాక్సెస్ చేయలేరని చెప్పారు. కార్ల్సన్ ఉపయోగించిన సిగల్ మెసేజింగ్ యాప్ అదే ఎన్‌క్రిప్షన్‌ను ఉపయోగిస్తుంది. కాబట్టి అదే నియమాలు వర్తిస్తాయి. అయితే, పరికరాల్లో నిల్వ చేయబడిన సందేశాలను వీక్షించకుండా చట్ట అమలు సంస్థలను ఎన్‌క్రిప్షన్ ఆపదని ఆయన గుర్తించారు. "వారు చేసేది ఏమిటంటే మీ ఫోన్‌కు యాక్సెస్ కలిగి ఉండటం. కాబట్టి, ఏదైనా ఎన్‌క్రిప్ట్ చేయబడిందా అనేది పట్టింపు లేదు. వారు దానిని సాధారణ దృష్టిలో చూడగలరు" అని ఆయన స్పష్టం చేశారు. ఇజ్రాయిల్ కంపెనీ ఎన్ఎస్ఓ గ్రూప్ అభివృద్ధి చేసిన స్పైవేర్ పెగాసస్ వంటి సాధనాలను జుకర్‌బర్గ్ ప్రస్తావించారు. వీటిని మొబైల్ ఫోన్‌లలో రహస్యంగా ఇన్‌స్టాల్ చేసి డేటాను యాక్సెస్ చేయవచ్చు.జుకర్‌బర్గ్ ప్రకారం.. వినియోగదారుల ప్రయివేట్ సందేశాలు నేరుగా వారి పరికరాల్లోకి చొరబడటం ద్వారా ప్రమాదంలో పడవచ్చు అనే వాస్తవం.. మెటా అదృశ్యమయ్యే సందేశాలను రూపొందించడానికి కారణం. ఇక్కడ ఒక నిర్దిష్ట కాలం తర్వాత ఒకరి సందేశ థ్రెడ్‌ను తొలగించవచ్చు. డిజిటల్ గోప్యత, ప్రభుత్వ నిఘా గురించి జరుగుతున్న చర్చల మధ్య జుకర్‌బర్గ్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. వినియోగదారు డేటాను రక్షించినందుకు ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ ప్రశంసలందుకున్నప్పటికీ.. సీఐఏ, ఎఫ్‌బీఐ వంటి ఏజెన్సీలు నేరాలు, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి చేసే ప్రయత్నాలను ఇది అడ్డుకోగలదని వాదించాయి. అదనంగా, ఎన్‌క్రిప్టెడ్ సందేశాలను ప్రసార సమయంలో అడ్డగించలేనప్పటికీ, క్లౌడ్ సేవల్లో నిల్వ చేయబడిన బ్యాకప్‌లు ఎన్‌క్రిప్షన్ కీని జతచేస్తే చట్ట అమలు సంస్థలు యాక్సెస్ చేయగలవని నివేదికలు సూచిస్తున్నాయి.

# గాజాలో విద్యావ్యవస్థ నిర్వీర్యం

**–యూనివర్సిటీలపై ఇజ్రాయిల్ బాంబుదాడులు : నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మలాలా**



ఇస్లామాబాద్
గాజాలో మొత్తం విద్యావ్యవస్థను ఇజ్రాయిల్ నిర్వీర్యం చేసిందని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మలాలా యూసఫ్‌జాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌లో 'ముస్లిం దేశాలలో బాలికల విద్య' పేరుతో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న అంతర్జాతీయ సమ్మిట్‌లో ఆదివారం ఆమె ప్రసంగించారు. ఈ సమ్మిట్‌కు పలు దేశాల ప్రతినిథులు హాజరయ్యారు.ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ.. గాజాలో అన్ని యూనివర్సిటీలపై ఇజ్రాయిల్ బాంబుదాడులు జరిపిందన్నారు. 90 శాతానికి పైగా పాఠశాలలను ధ్వంసం చేసిందనీ, పాఠశాల భవనాల్లో ఆశ్రయం పొందుతున్న పౌరులపై విచక్షణా రహితంగా దాడికి పాల్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ మానవహక్కుల, అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనలను తాను ప్రశ్నిస్తూనే ఉంటానని అన్నారు. పాలస్తీనాలో పిల్లలు తమ జీవితాలను, భవిష్యత్తును కోల్పోయారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఓ పాలస్తీనా బాలిక చదువుకునే పాఠశాలపై బాంబు దాడిచేసి, ఆమె కుటుంబాన్ని హత్య చేస్తే ఆమెకి భవిష్యత్తు లేకుండా చేసినట్టేనని అన్నారు.ఆఫ్ఘన్‌లో తాలిబన్ ప్రభుత్వానికి చట్టబద్ధత కల్పించవద్దనీ, మహిళలు, బాలికల విద్యను అడ్డుకుంటున్న వారి చర్యలను వ్యతిరే కించాలని ముస్లిం నేతలను ఆమె అభ్యర్థించారు. వాస్తవంగా చెప్పాలంటే మహి ళలను తాలిబన్లు మనుషులుగా చూడరనీ, సాంప్రదాయం, మతం పేరుతో సమర్థించుకుంటూ, తమ నేరాలను కప్పిపుచ్చుకుంటారని అన్నారు. మీ గొంతు కను వినిపించాల్సిన సమయం వచ్చిందనీ, మీరు నిజమైన నాయకత్వాన్ని చూపా లని సూచించారు. అయితే, ఈ కార్యక్రమానికి ఆఫ్ఘనిస్తాన్ ప్రతినిధులు హాజరు కాలేదు. వారికి అధికారికంగా ఆహ్వానం పంపినప్పటికీ సదస్సుకు రాలేదని పాకి స్థాన్ విద్యాశాఖ మంత్రి ఖలీద్ మక్బూల్ సిద్దిఖీ వెల్లడించిన సంగతి తెలిసిందే.

# ఎన్నికలప్పుడే రాజకీయాలు..

(మొదటి తరువాయి)

వేర్వేరు పార్టీల నుంచి పోటీచేసి, విజయం సాధించినా, వారంతా పార్లమెంటులో తమ మాతృభాష తమిళంలోనే ప్రమాణస్వీకారాలు చేశారని చెప్పారు. అలాంటి స్ఫూర్తిని తెలుగు ప్రజలు, రాజకీయనాయకులు అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగరరావు 'ఉనిక' పేరుతో రాసిన ఆత్మకథ పుస్తకాన్ని ఆదివారంనాడిక్కడి ఓ హోటల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఒడిశా గవర్నర్ కే హరిబాబు, కేంద్ర సహాయ మంత్రి బండి సంజరుకుమార్, రాష్ట్రమంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, సీనియర్ జర్నలిస్ట్ కే రామచంద్రమూర్తి, ఎమ్మెస్కో ప్రచురణ సంస్థ అధినేత విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర ఎంపీలు, ఎమ్మెల్యేలు సహా రాజకీయపార్టీల పాతతరం నాయకులు పలువురు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ అధికార, ప్రతిపక్ష నేతల మధ్య ఈ తరహా కార్యక్రమాలు విరివిగా జరగాలని ఆకాంక్షిస్తూ పుస్తక రచయిత చెన్నమనేని విద్యాసాగరరావును ప్రత్యేకంగా అభినందించారు. తన 35 ఏండ్ల రాజకీయ జీవితంలో ఆదర్శంగా తీసుకున్న నాయకులందర్నీ ఒకే వేదిక మీద కలిసే అవకాశం కలిగిందని సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుత రాజకీయాల్లో కార్పొరేటర్‌గా గెలిస్తేనే వివిధ ఆరోపణలు ఎదుర్కోవడం సర్వసాధారణంగా మారిందనీ, కానీ ఐదు దశాబ్దాలు రాజకీయ జీవితం గడిపిన విద్యాసాగరరావు ఎలాంటి మరక లేకుండా ఆదర్శవంతంగా ప్రజలకు చేరువ అయ్యారని ప్రశంసించారు. ఉస్మానియా యూనివర్సిటీ రాజకీయాల్లో జార్జిరెడ్డి, విద్యాసాగర్‌రావు నమ్మిన సిద్ధాంతం కోసం గట్టిగా నిలబడ్డారనీ, కానీ ప్రస్తుతం ఆ యూనివర్సిటీలు ఉనికి కోల్పోయేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. యూనివర్సిటీల్లో విద్యార్థులు రాజకీయాల్లో ఉండటం అవసరమని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో యూనివర్సిటీ విద్యార్థులు ముందుండి పోరాటాలు చేశారనీ, వారు రాజకీయాల్లో క్రియాశీలంగా ఉండాలని తాను కోరుకుంటానని చెప్పారు. అక్కడి నుంచే రాష్ట్ర నేతలు ఎన్నిక కావాలనీ, అప్పుడే సమర్ధవంతమైన నాయకత్వం వస్తుందని అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లో సిద్ధాంతపరమైన భావజాలం లేకపోవడం వల్లే నేడు పార్టీ ఫిరాయింపులు జరుగుతున్నాయని అన్నారు. కేవలం ఏదో ఒక పదవి కోసం పార్టీలు మారుతున్నారనీ, దీనిపై తానింతకు మించి మాట్లాడటం సముచితం కాదని తెలిపారు. విద్యార్థి దశలో సిద్ధాంతపరమైన రాజకీయాలు చేస్తేనే పార్టీలకు కట్టుబడి ఉంటారనీ, రాష్ట్రంలో ఆ తరహా రాజకీయాలను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం అంటే ప్రతిపక్షం, పాలక పక్షం కాదనీ, 119 మంది ఎమ్మెల్యేలు కలిస్తేనే ప్రభుత్వమని వివరణ ఇచ్చారు. ప్రభుత్వంలోని లోపాలను ఎత్తి చూపించడం ప్రతిపక్షం ప్రధాన పాత్ర అనీ, కానీ కాల క్రమంలో ప్రజాస్వామ్య స్ఫూర్తిని కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ, పార్లమెంటులో పాలక పక్షానికి, ప్రతిపక్షానికి మధ్య ప్రతిష్టంభన ఏర్పడినప్పుడు కమ్యూనిస్టులు, బీజేపీ, ఇతర పార్టీల నాయకులు జోక్యం చేసుకొని సలహాలు, సూచనలు ఇస్తూ, సభా సాంప్రదాయాలను కొనసాగించేవారని గుర్తుచేసుకున్నారు. తమ ప్రభుత్వం ఇప్పుడు ఆ స్ఫూర్తితోనే పనిచేస్తుందనీ, 13 నెలల్లో ఇప్పటి వరకు అసెంబ్లీ నుంచి ప్రతిపక్ష సభ్యుల్లో ఏ ఒక్కరినీ బహిష్కరించలేదని చెప్పారు. గోదావరి జలాల కోసం అప్పట్లో సీహెచ్ విద్యాసాగరరావు పాదయాత్ర చేశారనీ, దానికి కొనసాగింపుగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్టును తీసుకువచ్చారని ఉదహరించారు. అయితే గోదావరి జలాల వినియోగం ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదనీ, వాటిని సాధించేందుకు మహారాష్ట్ర గవర్నర్‌గా పనిచేసిన విద్యాసాగరరావు సలహాలు, సూచనలు తమకు ఎంతో అవసరమని అన్నారు. మహారాష్ట్రలో ముంపుకు గురయ్యే భూములకు సంబంధించి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడమని తానే గతంలో కోరానని గుర్తుచేశారు. తుమ్మిడి హెట్టి దగ్గర భూసేకరణ కోసం ఆయన సహకారాన్ని తీసుకుంటామని చెప్పారు. భేషజాలు లేకుండా, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ఎవరినైనా కలిసి, సహకారం తీసుకుంటానని స్పష్టంచేశారు. రాష్ట్రాన్ని ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తయారు చేయడం కోసం సహకరించాలని తాను ప్రధాని మోడీని కోరానని తెలిపారు. రాష్ట్రంలో 60 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తుందనీ, ఆ నగరం విశ్వనగరంగా మారాలంటే రీజినల్ రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రైల్ కావాలన్నారు. తెలంగాణకు తీర ప్రాంతం లేదు కాబట్టి డ్రైపోర్టు కావాలనీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీని త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉందనీ, తాము అమరావతితో పోటీ పడట్లేదనీ, న్యూయార్క్, టోక్యో వంటి ప్రపంచ నగరాలతో పోటీ పడతామని వివరించారు. దానికోసం మెట్రో రైల్‌కు అనుమతులు తెచ్చుకోవాల్సి ఉందన్నారు. తమిళనాడులో డీఎంకే ప్రభుత్వం ఉన్నా, కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా ప్రధాని మోడీ మెట్రోరైళ్లకు సహకారాన్ని అందించారని గుర్తుచేశారు. ఈ విషయాల్లో ప్రధాని మోడీ, కేంద్ర ప్రభుత్వాన్ని ప్రభావితం చేయగలిగిన నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కేంద్ర మంత్రులు బండి సంజరు, జీ కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత వినోద్‌కుమార్ వంటి నాయకులు పార్టీలకు అతీతంగా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. వచ్చే కేంద్ర మంత్రివర్గ సమావేశంలో హైదరాబాద్ మెట్రోకు అనుమతి ఇస్తే బాగుంటుందని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచడం కోసం 75 ఐటీఐలను ఐటీసీలు మారుస్తున్నామన్నారు. రూ.2,100 కోట్లతో టాటా సంస్థ యువతకు శిక్షణ, ఉపాధి కల్పించేందుకు ముందుకు వచ్చిందన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ కోసం వివిధ మార్గాల్లో రూ.600 కోట్ల కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేశామనీ, ఈ ఏడాది జూన్ రెండవ తేదీలోపు యూనివర్సిటీ భవన నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. 140 కోట్ల జనాభా ఉన్న భారతదేశం ఒలంపిక్స్‌లో పతకాలు తేలేకపోయిందనీ. 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ నుంచే బంగారు పతకాలు తేవడం ప్రారంభంకావాలని కోరుకుంటూ స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

# కౌశిక్‌రెడ్డి VS సంజయ్

(మొదటి తరువాయి)

డాక్టర్ సంజయ్ ప్రసంగిస్తుండగా.. 'నువ్వు ఏ పార్టీయో ముందు చెప్పు' అంటూ హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అడ్డుకున్నారు. అందుకు 'నేను కాంగ్రెస్ పార్టీయే' అంటూ బదులివ్వగా కౌశిక్‌రెడ్డి అభ్యంతరం తెలపడంతో ఇరువురి మధ్య మాటలతూటాలు పేలాయి. ఒక దశలో ఇద్దరూ ఒకరినొకరు తోసుకుంటూ దుర్భాలాడుకున్నారు. పరిస్థితి చేయిదాటిపోకుండా వెంటనే ముగ్గురు మంత్రులు, ఇతర సహచర ఎమ్మెల్యేలు అడ్డుకుని పోలీసుల చేత కౌశిక్‌రెడ్డిని బయటకు పంపించడంతో పరిస్థితి సద్దుమణిగింది. రైతుభరోసా, కొత్త రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు పథకాలపై ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఎమ్మెల్యేలు, మంత్రులు, కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి కరీంనగర్ కలెక్టరేట్‌లో కార్యాచరణ ప్రణాళిక– సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు సహా అధికార, విపక్షపార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.

సమావేశ ప్రారంభంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ప్రసంగం ప్రారంభించగానే.. పక్కనే ఉన్న బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి %'ా%'ముందు నువ్వు ఏ పార్టీయే చెప్పాలి' అని ప్రశ్నించారు. ఇందుకు బదులిస్తూ 'నేను కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేను' అని సంజయ్ సమాధానం ఇవ్వగా కౌశిక్‌రెడ్డి అభ్యంతరం తెలిపుతూ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. ఒక దశలో పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్ ఒకరినొకరుతోసుకుంటూ 'నువ్వెంతరా..! అంటే నువ్వెంతరా!' అనుకుంటూ బూతుపురాణం అందుకున్నారు. కరీంనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సైతం కౌశిక్‌రెడ్డిని వారించే ప్రయత్నం చేశారు. చివరికి ఆయనను బయటకు తీసుకెళ్లారు.

అధికారులు, పోలీసులకు కౌశిక్‌రెడ్డి వార్నింగ్

'బీఆర్ఎస్ బీఫామ్‌తో గెలిచి సిగ్గులేకుండా కాంగ్రెస్ ఎమ్మెల్యేనని చెప్పుకుంటున్నారు. మా పార్టీ తరుపున గెలిచి కాంగ్రెస్ తరుపున మాట్లాడితే మేం చూస్తూ ఊరుకోవాలా?' అంటూ హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. రివ్యూ సమావేశం నుంచి బయటకొచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. రైతు భరోసా రూ.15వేలకు బదులు రూ.12వేలు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయాలు ప్రశ్నించేందుకు వచ్చిన తనను అడ్డుకుంటారా? అంటూ అధికారులకు, పోలీసులకు వార్నింగ్ ఇచ్చారు. 'మీకు జీతాలు పెంచింది. వాహనాలు సమకూర్చింది. స్టేషన్లను ఫైవ్‌స్టార్‌లా తీర్చిదిద్దింది కేసీఆర్ అన్న సంగతి మరిచిపోయారా?. మరో మూడేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది. అప్పుడు ప్రతికారం తీసుకోవాల్సి వస్తుంది'అంటూ హెచ్చరించిన తీరు, రివ్యూ మీటింగ్‌లో సంజయ్‌పై తూలిన మాటల వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది.

కౌశిక్ వ్యవహారంపై తీవ్ర అసహనం

హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి స్వయంగా బంధువు, సోదరుడైన రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలోనే దూకుడు ప్రదర్శించారు. అధికారికంగా జరుగుతున్న సమీక్షా సమావేశంలో పార్టీల ఫిరాయింపుల విషయాలను ప్రస్తావనకు తీసుకురావడంతో మీటింగ్ కాస్త పొలిటికల్ వార్‌గా మారింది. కౌశిక్‌ను బయటకు పంపిన తరువాత మీటింగ్ రసాభాసపై మంత్రులు, ఇతర ఎమ్మెల్యేలు స్పందించారు.

# ఐదేండ్లలో పాలమూరు సమగ్రాభివృద్ధి

(మొదటి తరువాయి)

చేస్తామని, ఇందుకోసం రూ. లక్ష కోట్లు ఖర్చు చేస్తామన్నారు. ఆదివారం మల్లు భట్టి విక్రమార్క నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటించి సుమారు రూ. 89.41 కోట్ల నిధులతో మార్కండేయ ఎత్తిపోతల పథకం ప్రారంభం, ఐదు విద్యుత్ ఉపకేంద్రాల శంకుస్థాపనలు చేశారు. డిప్యూటీ సీఎంకు జిల్లా ముఖద్వారం వద్ద నాగర్‌కర్నూలు ఎమ్మెల్యే కూచికుల్ల రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. తిమ్మాజిపేట, మరికల్ గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. పొదిరెడ్డిపల్లిలో విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లాకు తాగు, సాగు నీరు అందించటం కోసం కృష్ణా నదిలో ఉన్న ప్రతి నీటి చుక్కనూ వినియోగించుకోవడానికి ఎంత ఖర్చు చేయడానికైనా ప్రజా ప్రభుత్వం వెనుకాడదన్నారు. రూ. 38వేల కోట్లతో మొదలుపెట్టిన పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. భూసేకరణ చట్టాన్ని తుంగలో తొక్కి నిర్వాసితులకు అన్యాయం చేసిందన్నారు. భూసేకరణ నిధులను ప్రాధాన్యత క్రమంలో నిర్వాసితులకు తమ ప్రభుత్వం విడుదల చేస్తుందని తెలిపారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీని అమలు చేస్తామన్నారు. తమ ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి 12 లక్షల ఎకరాలకు నీళ్లు పారిస్తుందని చెప్పారు. మహిళలకు ఐదేండ్లలో లక్షకోట్లు వడ్డీ లేని రుణాలను అందిస్తామన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలోని ఉమామహేశ్వర, చేన్న కేశవ ఎత్తిపోతల ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పారు. రైతు భరోసా పెట్టుబడి పదివేల నుంచి 12 వేలకు పెంచుతూ రైతులకు అందించబోతున్నట్టు తెలిపారు. భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఏడాదికి 12 వేల రూపాయలు ఇచ్చే కార్యక్రమం ఈనెల 26 నుంచి మొదలు కాబోతుందని చెప్పారు. విద్యుత్ శాఖలో అత్యవసర సమస్యల పరిష్కారం కోసం 1912 నెంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. సంక్రాంతి పండుగ తర్వాత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి పేదలకు 5 లక్షల రూపాయలు ఇవ్వబోతున్నట్టు తెలిపారు.

# ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

(మొదటి తరువాయి)

ఉదయం భద్రతా సిబ్బంది బృందం యాంటీ నక్సలైట్ ఆపరేషన్ చేపడుతుండగా కాల్పులు జరిగాయని బస్తర్ ఐజీ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో జిల్లా భద్రతా బలగాలు (డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్), డిస్ట్రిక్ట్ ఫోర్స్‌కు చెందిన సిబ్బంది పాల్గొన్నారని వివరించారు. ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలతో పాటు పలు ఆయుధాలు, పేలుడుపదార్థాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ ప్రాంతంలో ఇంకా సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని వెల్లడించారు. గతేడాది వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 219 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఈ ఏడాది ప్రారంభంలో 12 రోజుల వ్యవధిలో 12 మంది మావోయిస్టులను ప్రభుత్వం మట్టుబెట్టింది. దండకారణ్యంలో రక్తమోడుతున్న తీరుతో అడవిపుత్రుల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# రాష్ట్రాన్ని రావణకాష్టం చేస్తున్నారు

(మొదటి తరువాయి)

సిద్ధమని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వానాకాలం గుండు సున్న అని, కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లోకి వస్తే ఎకరానికి రూ.15 వేలు ఇవ్వలేదని నిలదీయాలని రైతులకు సూచించారు. కనపడ్డ దేవుళ్లందరి మీద ఒట్టు పెట్టి రైతు రుణమాఫీ అన్నాడు.. ఏడాది గడిచినా ఇంతవరకు రైతు రుణమాఫీ కాలేదన్నారు. పది పంటలకు బీమా అని చెప్పి ఒక్క పంటకే ఇచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిట్టిన తిట్టు తిట్టకుండా రైతులు తిడుతున్నారన్నారు. ప్రజల దృష్టి మళ్లించడానికి సీఎం హింస రాజకీయాలు చేస్తున్నారన్నారు. యాదాద్రిలో దాడులు చేస్తున్నవారిని, పోలీసులే ప్రోత్సహిస్తున్నట్టు కనిపిస్తుందన్నారు. కౌశిక్ రెడ్డి, అల్లు అర్జున్ ఇండ్లమీద దాడులు, బీఆర్ఎస్, బీజేపీ కార్యాలయాలపైనా కాంగ్రెస్ గుండాలు దాడులు చేశారన్నారు. ముఖ్యమంత్రి మౌనం ఈ దాడులను ప్రోత్సహిస్తున్నట్టుగా ఉందన్నారు. రాష్ట్రాన్ని రావణకాష్టంగా మారుస్తున్నారని, తమ ఓపికను బలహీనంగా తీసుకోవద్దని, ప్రశ్నిస్తే దాడులు చేయడం మంచిది కాదన్నారు. రాష్ట్రంలో క్రైం రేట్ పెరిగిందని, రాష్ట్రపతి పాలన పెట్టయినా రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాలని కేంద్రాన్ని కోరారు. మతకలహాలు కూడా పెరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫారుకు హుస్సేన్, గుండు భూపేష్, కొండం సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్వల్పదూరంలో స్పేడెక్స్ ఉపగ్రహాలు

(మొదటి తరువాయి)

ఆపై 3 మీటర్లకు ఈ దూరాన్ని తగ్గించింది. ఈ ప్రక్రియ ముగిసిన అనంతరం తిరిగి రెండు ఉపగ్రహాలను సురక్షితమైన దూరానికి జరిపినట్టు పేర్కొన్నది. ఈ డేటాను విశ్లేషించిన తర్వాత డాకింగ్ ప్రక్రియ చేపడతామని ఇస్రో ప్రకటించింది. అంతకు ముందు స్పేడెక్స్ ఉపగ్రహాల చిత్రాలను కూడా ఎక్స్‌లో పోస్టు చేసింది. ఆదివారం తెల్లవారు జామున 3.10 సమయంలో తొలుత ఈ ఉపగ్రహాలను 105 మీటర్ల దగ్గరికి చేర్చారు. అనంతరం అవి చేతులు కలపడానికి సిద్ధంగా ఉన్నాయని ఇస్రో పేర్కొన్నది. నింగిలో డాకింగ్ కోసం జంట స్పేడెక్స్ ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగించింది. అవి 'హోల్డ్' దశలో ఉన్నాయి. ఎస్‌డీఎక్స్01 (ఛేజర్), ఎస్‌డీఎక్స్02 (టార్గెట్) అనే ఈ రెండు ఉపగ్రహాలను గతనెల 30న పీఎస్ఎల్వీ రాకెట్ ద్వారా 475 కిలోమీటర్ల వృత్తాకార కక్ష్యలోకి ప్రవేశపెట్టిన సంగతి విధితమే. 7, 9 తేదీల్లో వీటిని అనుసంధానం (డాకింగ్) చేసేందుకు నిర్ణయించినప్పటికీ.. వివిధ కారణాలతో అది వాయిదాపడింది. ఆ ప్రక్రియ ఇప్పుడు జోరుగా సాగుతున్నది.

# మాజీ ఎంపీ మందా జగన్నాథం మృతి

(మొదటి తరువాయి)

వెంటిలేషన్‌పై ఆయనకు వైద్యులు చికిత్స అందించారు. క్రమంగా ఆయన ఆరోగ్యం క్షీణించడంతో ఆదివారం రాత్రి 7.40 గంటలకు మరణించినట్టు నిమ్స్ వైద్యులు ధృవీకరించారు. 1996,1999,2004లో టీడీపీ నుంచి 2009లో కాంగ్రెస్ నుంచి విజయం సాధించారు. 2014లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆయన ప్రస్తుతం రాజీయాలకు దూరంగా ఉంటున్నారు. ఆయన మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, భట్టి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజరు, పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నాయకులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి తదితరులు సంతాపం ప్రకటించారు.

## రైతు భరోసా మార్గదర్శకాలు విడుదల

(మొదటి తరువాయి)

రైతుభరోసా సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వ్యవసాయ యోగ్యం కాని భూములను రైతుభరోసా నుంచి తొలగించింది. ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాదారులు కూడా రైతుభరోసాకు అర్హులు అని ప్రకటించింది. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిర్వహించే డీబీటీ పద్ధతిలో రైతుభరోసా సహాయం రైతుల ఖాతాలో జమ చేయాలని నిర్ణయించింది. రైతుభరోసా పథకం వ్యవసాయశాఖ సంచాలకులు ద్వారా తెలంగాణ ప్రభుత్వం అమలు చేయనుంది. ఎన్ఐసీ, ఐటీ భాగస్వామిగా బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపింది. జిల్లా కలెక్టర్లకు పథకం అమలు, ఫిర్యాదులతోపాటు వాటిని పరిష్కరించే బాధ్యతను అప్పగించింది. వ్యవసాయశాఖ కమిషనర్ తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. రైతు భరోసా పథకం ఉత్తర్వులు తెలుగులో జారీ చేయడం విశేషం.

# సంపాదకీయం

## మన్మోహన్: కాంతులు, కళంకాలు

చరిత్ర తీర్పు తనపై చాలా ఉదారంగా ఉంటుందని' ఇటీవల కీర్తిశేషుడు అయిన డాక్టర్ మన్మోహన్ సింగ్ 2014లో ప్రధానమంత్రిగా తన చివరి పత్రికా గోష్ఠిలో ఉద్ఘాటించారు. ఆయన ఆత్మవిశ్వాసపూరిత వ్యాఖ్యను, అప్పట్లో మీడియా తన పట్ల వ్యవహరిస్తున్న తీరుపై ఒక పరోక్ష ఆక్షేపణగా అర్థం చేసుకోవచ్చు. మరి ఇప్పుడు అదే మీడియా మన్మోహన్ కీర్తిగానం బ్రహ్మాండంగా చేస్తోంది. వివిధ పత్రికలు, పలువురు ప్రముఖులు దివంగత ప్రధానమంత్రికి అర్పించిన నివాళులు, చేసిన ప్రశంసలు చరిత్రకారుడు అయిన ఈ వ్యాసకర్తను చకితుడిని చేశాయి. ఆ పొగడ్తలు పూర్తిగా యోగ్యమైనవేనా? వాటిలో సత్యాసత్యాలు ఏమిటి? అన్న ప్రశ్నలను లేవనెత్తాయి. మన్మోహన్ నిజంగానే విజ్ఞుడా? సర్వజ్ఞుడా? ఉత్తమ రాజనీతిజ్ఞుడా? మన్మోహన్ సింగ్ తన సుదీర్ఘ జీవితాన్ని ఒక విద్వజ్జుడుగా, ప్రభుత్వంలో ఒక ఆర్థికవేత్తగా, ఒక రాజకీయవేత్తగా గడిపారు. మరణానంతరం ఆయన గురించి వెల్లువెత్తిన ప్రశంసల్లో అత్యధిక భాగం ప్రభుత్వ ఆర్థికవేత్తగా ఉన్న దశపైనే కేంద్రీకృతమయ్యాయి. ముఖ్యంగా కేంద్ర ఆర్థికమంత్రిగా ఆయన నిరుపమాన సేవల గురించి అవి విపులంగా పేర్కొన్నాయి. నిజమే, లైసెన్స్%-% పర్మిట్%-% కోటా రాజ్‌ను కూల్చివేయడంలో మన్మోహన్ కీలకపాత్ర వహించారు. రాజ్యవ్యవస్థ శృంఖలాల నుంచి భారత ఆర్థిక వ్యవస్థను విముక్తం చేశారు దరిమిలా మూడు దశాబ్దాలుగా ఆర్థికాభివృద్ధి సుస్థిరంగా సాగుతోందిబీ పరిశ్రమల వ్యవస్థాపనా సామర్థ్యం ఇతోధికంగా పెరిగిందిబీ కోట్లాది ప్రజలు పేదరికం కోరల నుంచి బయటపడ్డారు. ఇది నిజంగా విశేష ప్రగతే. మన్మోహన్ దార్శనికత వల్లే అది సాధ్యమయిందని సరిగానే ఆయన్ను ప్రస్తుతిస్తున్నారు. అయితే మన్మోహన్ సాధించిన ఈ బృహత్ విజయం వెనుక ఆయనకు అప్పటి ప్రధానమంత్రి పీవీ నరసింహారావు అందించిన అచంచల తోడ్పాటు ఉందన్న విషయాన్ని ఎవరూ విస్మరించకూడదు. పార్లమెంటుకు ప్రజలు ఎన్నుకోని ఆర్థికవేత్తను కేబినెట్ మంత్రిగా నియమించిన ఘనత నిస్సందేహంగా పీవీదే. ప్రతిపక్షాల నుంచి, సొంత పార్టీలోని వ్యతిరేకుల నుంచి ఎదురైన కష్టనష్టాలను పీవీ మద్దతుతో మన్మోహన్ అధిగమించారు. మన్మోహన్‌తో కలిసి లేదా ఆయన మార్గదర్శకత్వంలో ప్రతిభావంతులు అయిన కొంతమంది ఆర్థికవేత్తలు, సివిల్ సర్వీస్ అధికారులు మన ఆర్థిక వ్యవస్థలో మౌలిక మార్పులు సాధించారు. మన్మోహన్ సింగ్ యాదృచ్ఛికంగా ఆర్థికమంత్రి అయ్యారు. 1991లో రాజీవ్ హత్యానంతరం పీవీ ప్రధానమంత్రి అయ్యారు. విదేశీ మారక ద్రవ్య నిల్వలు పూర్తిగా అడుగంటిపోయాయి. ఆ క్లిష్ట పరిస్థితి నుంచి దేశాన్ని గట్టెక్కించేందుకు పీవీ తొలుత రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ ఐ.జి.పటేల్‌ను ఆర్థికమంత్రిగా నియమించేందుకు సంకల్పించారు. అయితే పటేల్ అందుకు నిరాకరించడంతో ఆర్థికమంత్రి అయ్యే అవకాశం మన్మోహన్‌కు లభించింది. విద్వజ్జుడుగా మన్మోహన్ ప్రత్యేకతలు పూర్తిగా ఆయన సొంతం. మన్మోహన్ సాధించిన విజయాల ప్రాముఖ్యతను గుర్తించేందుకు కేంబ్రిడ్జిలో ఆయన సమకాలికులు అయిన అమర్త్యసేన్, జగదీష్ భగవతి మేధో విజయాలతో వాటి తారతమ్యాలను చూడాలి. సేన్, భగవతి కులీన విద్వత్ కుటుంబాలలో జన్మించారు. సేన్ కుటుంబం రవీంద్రనాథ్ టాగోర్‌కు సన్నిహితులైన విద్వజ్జుల కుటుంబం నుంచి వచ్చారు. సేన్‌కు 'అమర్త్య' అని నామకరణం చేసింది కూడా టాగోరే కావడం విశేషం. భగవతి ఒక హైకోర్టు న్యాయమూర్తి కుమారుడు. కులీన సామాజిక నేపథ్యాల కారణంగా సేన్, భగవతి సహజంగానే తమ ఉన్నత విద్యాభ్యాసానికి కేంబ్రిడ్జి వెళ్లారు. మరి మన్మోహన్ ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. దేశ విభజన పరిణామాలతో ఆయన కుటుంబం బాగా చితికిపోయింది. తీవ్ర ప్రతికూల పరిస్థితులలో ఎంతో కష్టపడి చదువుకున్న మన్మోహన్‌కు ఒక ప్రతిష్ఠాత్మక పాశ్చాత్య విశ్వవిద్యాలయానికి వెళ్లడమనేది ఒక అసాధ్య విషయం. అయితే మన్మోహన్ కేంబ్రిడ్జికి వెళ్లగలిగారు. అక్కడ పట్టభద్రుడైన తరువాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో డి.ఫిల్ పట్టా పొందారు. 2009 తొలినాళ్లలో నేను ఒక నెల రోజుల పాటు న్యూఢిల్లీలో ఉన్నాను. ప్రధానమంత్రి మన్మోహన్‌తో సమావేశమయ్యాను. అంతకంటే ముఖ్యంగా ప్రభుత్వంలోను, వెలుపల ఆయనకు సన్నిహితులైన పలువురు అధికారులతో నేను సంభాషించాను. పెద్ద వయస్సు, అందునా, గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్న కారణంగా తదుపరి సార్వత్రిక ఎన్నికలలోగానే మన్మోహన్ సింగ్ గౌరవప్రదంగా రాజకీయాల నుంచి నిష్క్రమించడం శ్రేయస్కరమని ఆ అధికారులు అందరూ అభిప్రాయపడ్డారు. ప్రధానమంత్రి పదవిలో కొనసాగుదలుచు కుంటే లోక్‌సభకు పోటీ చేసి గెలిస్తే ఆయన విశ్వసనీయత మరింతగా పెరుగుతుందని మన్మోహన్ అభిమాని ఒకరు పేర్కొన్నారు. అదే ఏడాది మన్మోహన్ రెండో పర్యాయం ప్రధానమంత్రి అయ్యారు. రాజ్యసభలోనే సభ్యుడుగా ఆయన కొనసాగారు. మొదటి పర్యాయం ప్రధానిగా ఉన్నప్పుడే ఆయన తన పార్టీ అధినేత్రి పట్ల మితిమీరిన రీతిలో వినయ విధేయతలు చూపుతున్నారని నిశిత పరిశీలకులు గమనించారు. రెండోసారి ప్రధాన మంత్రి అయిన తరువాత ఆ విధేయత మరింతగా పెరిగింది. అది ఆయన నిర్వహిస్తున్న అత్యున్నత పదవి గౌరవానికి తగని విధంగా ఉండేది. ఇదిలా ఉండగా మన్మోహన్ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు తీవ్రమయ్యాయి.

బహిర్గతమైన వివిధ కుంభకోణాలలో కేంద్ర మంత్రుల పాత్ర ఉన్నట్టు రుజువయింది. వారిపై చర్య తీసుకోవడంలో మన్మోహన్ విఫలమయ్యారు. తనను ధిక్కరిస్తున్న మంత్రులను కూడా ఆయనేమీ చేయలేకపోయారు. మొదటి పర్యాయం ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు కొందరు ప్రముఖ విద్యావేత్తలతో నాలెడ్జ్ కమిషన్‌ను నియమించారు. అయితే మానవవనరుల అభివృద్ధి మంత్రి అర్జున్ సింగ్ ఆ కమిషన్‌కు ఎటువంటి అధికారాలు లేకుండా చేసి నీరుకార్చివేశారు. రెండో పర్యాయం ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ప్రణబ్ ముఖర్జీని సుదీర్ఘకాలం ఆర్థికమంత్రిగా కొనసాగించారు. ప్రణబ్ హయాంలో అంతర్జాతీయ మార్కెట్లలో భారత్ ప్రాభవం క్షీణించి పోయింది. ఆర్థిక సంస్కరణల అనంతర కాలంలో మొట్టమొదటి 'అధ్వాన్న ఆర్థికమంత్రి' అన్న అప్రతిష్ఠను ప్రణబ్ మూటగట్టుకున్నారు. వైదుష్యంలో మన్మోహన్‌కు అర్జున్ సింగ్ ఏ మాత్రం సాటి రారు. ఆర్థిక మంత్రిత్వ శాఖను ప్రణబ్ కంటే మన్మోహనే అత్యంత సమర్థతతో నిర్వహించారని మరి చెప్పనవసరం లేదు. అయినప్పటికీ భయపడే స్వభావం కారణంగా, లోక్‌సభకు ఎన్నికైన సహచర మంత్రులు తనను ధిక్కరిస్తున్నప్పటికీ మన్మోహన్ వారిని నియంత్రించలేకపోయారు. బహుశా, పార్టీ అధినేత్రితో సమస్యలు వస్తాయన్న భయంతో ఆయన మిన్నకుండిపోయేవారు.

# మత విద్వేషం

పావురాలు స్వేచ్ఛగా ఎగురుతుంటాయి. 'మనం గుడి, మసీదు, చర్చి, గురుద్వారాలన్నిటి మీదా వాలుతాం. అక్కడ కనిపించిన గింజలు ఏరుకుని తింటాం. మనలాగే మనుషులు కూడా వాటిలో తిరుగుతూ%ొ%ప్రార్థనలు చేస్తుంటారు కానీ, వాళ్లలో వాళ్లు తన్నుకుంటారెందుకు? మన పావురాల్లో అలాంటి కొట్లాటలు, రాళ్ళు విసరడాలు, నరికి చంపడాలు ఉండవు కదమ్మా?' అని ఓ బుల్లి పావురం తల్లి పావురాన్ని అడిగిందట. 'మనం మనుషుల కన్నా ఎంతో ఎత్తుకు ఎదిగిన వాళ్ళం. పైపైకి ఎగిరినకొద్దీ అందమైన, అద్భుతమైన దృశ్యాల్ని చూస్తాం! మనది స్వేచ్ఛా ప్రపంచం. జీవరాశులన్నింటిలోనూ మనుషులు వివేకం, విజ్ఞానం కలిగినవాళ్లే గానీ%ొ%వాళ్ల చుట్టూ కుల, మత, జాతి, లింగ, వర్గ, వర్ణ, ప్రాంతాల వంటి ఎత్తైన అడ్డు గోడలు కట్టుకుని, తమ వివేకానికి, విజ్ఞానానికి మకిలి పట్టించుకుంటున్నారు' అని చెప్పింది తల్లి పావురం. 'మతము మత్తుగూర్చు మార్గమ్ము కారాదు/ హితముగూర్చవలయు నెల్లరకును/ హితము గూర్పలేని మతము మానగవలె' అంటారు పోతులూరి వీరబ్రహ్మం. మతం మనుషుల్ని కలపాలేగాని, ద్వేషం పెంచేదిగా వుండరాదు. మతం మనుషుల మధ్య వుండే అడ్డుగోడల్ని పగులగొట్టాలి. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో గత దశాబ్ద కాలంగా మనుషుల్ని విభజించే, భయాన్ని సృష్టించే, మన సమాజంలోని పెద్ద సెక్షన్ ను వేరు చేసే విద్వేష రాజకీయాలను చూస్తున్నాం. 'రామరాజ్యమంటే నా దేశం హిందూ రాజ్యం కాదు. రామరాజ్యమంటే దైవ పాలన. భూమిపై దేవుని రాజ్యం' అంటారు గాంధీజీ. కానీ, భారత దేశాన్ని విద్వేష సునామీ ముంచెత్తుతోంది. సామాజిక జీవనంలో మత విద్వేషం బుసలు కొడుతున్న దేశాల్లో భారత్ ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉందని 'ప్యూ రీసెర్చ్ సెంటర్' తాజా నివేదిక వెల్లడించింది. 198 దేశాల్లో 'సామాజిక వర్గాల మధ్య శత్రుత్వ భావన (ఎస్‌హెచ్‌ఐ)' అన్న అంశంపై అధ్యయనం చేసిన 'ప్యూ' సంస్థ తాజా ఇండెక్స్ ప్రకారం భారత్ 9.3 పాయింట్లతో తొలి స్థానంలో ఉండటం అత్యంత విషాదం. 2024కి సంబంధించి దేశంలోని ప్రముఖ ఆంగ్లపత్రికల క్లిప్పింగ్‌లను పరిశీలిస్తే.. దేశవ్యాప్తంగా మతపరమైన హింసాకాండ 84 శాతం పెరిగిందని 'సెంటర్ స్టడీ



ఆఫ్ సొసైటీ అండ్ సెక్యులరిజం' నివేదిక తెలిపింది. 2024 లోనే భారత్‌లో క్రైస్తవులపై 834 దాడులు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయని యూసీఎఫ్ విడుదల చేసిన సమాచారం బట్టి తెలుస్తోంది. ఈ మధ్యనే కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌పై విషం చిమ్మిన సంగతి తెలిసిందే. ఇక ప్రధాని మోడీ.. దేశంలోని ముస్లింలు, మైనారిటీలకు వ్యతిరేకంగా చేసిన విద్వేష ప్రసంగాలు కోకొల్లలు. మతోన్మాద ఘటనలు నానాటికీ పెరుగుతున్నాయన్నది మన జీవితానుభం. ఇది మెజార్టీ లేదా మైనార్టీ మతోన్మాదం ఏదైనా ప్రమాదకరమే! సమాజంలోని మనమంతా ఒక్కటే. మనకు కావాల్సింది సమతా ధర్మం. ఏ మతాన్ని విశ్వసిస్తారు, ఏ దేవుడ్ని పూజిస్తారన్నది వ్యక్తిగతం. అది ఇంటి లోపలే వుండాలి. గడప దాటితే మనమంతా భారతీయులం. ఎవరి స్వేచ్ఛ వారిది. కాదనే హక్కు ఎవరికీ లేదు. 'మతమన్నది నా కంటికి మసకైతే/ మతమన్నది నా మనసుకు మబ్బయితే/ మతం వద్దు గితం వద్దు-మాయా మర్మం వద్దు' అన్న దేవులపల్లి కృష్ణశాస్త్రి మానవత్వంపై నమ్మకమున్న కవి. కనుకనే మతాన్ని తీవ్రంగా నిరసించాడు. అసలైన దేశభక్తి మనుషులను ప్రేమించడంలో ఉందని-'అన్నదమ్ముల వలెను జాతులు/ మతములన్నీ మెలగవలెనోయి/మతం వేరైతేను యేమోయి/ మనసులొకటై మనుషులుంటే' అని వందేళ్ల కిందటే మహాకవి గురజాడ చెప్పిన మాటలు ఇంకా మతోన్మాదుల బుర్రకెక్కలేదు. 'బతకడమే సమస్యగా/ పరిణమింప జేసినట్టి/ అన్యాయాలన్నిటినీ/ హతమార్చాలంటాడు' మహాకవి శ్రీశ్రీ. మత విశ్వాసాన్ని, మత విద్వేషాన్ని వేర్వేరుగా చూడాలి. 'గడప లోపలే మతం, కులం. గడప దాటితే మనమంతా హిందువులం' అని చెప్పడంలోనే బిజెపి ద్వంద్వనీతి వుంది. ఇలా చెప్పడమంటే%ొ%కుల, మత విద్వేషాన్ని చిమ్మడమే.

# బిజెపి హఠావో.. ఢిల్లీ బచావో.. తీర్పు ఎటు?

దేశ రాజధాని మాత్రమేగాక బిజెపి భవిష్యత్తు అంచనాలపై తీవ్ర ప్రభావం చూపే ఢిల్లీ శాసనసభ ఎన్నికలు రానే వచ్చాయి. ఫిబ్రవరి 5న ఎన్నికలు, 8న ఫలితాల ప్రకటన ఎలా వుంటుందనే దానిపై దేశమంతా ప్రత్యేకాసక్తిగా ఎదురు చూస్తుంది. ఢిల్లీ రాజధాని మాత్రమే గాక వివిధ రాజకీయ శక్తుల మధ్య పోరాటంలో ఒక కీలక పాత్ర వహిస్తుంది. దీర్ఘకాలం పాటు బిజెపి పట్టులో వుండి తర్వాత కాంగ్రెస్ హ్యాట్రిక్‌లు చూసి ఆ పైన శాసనసభ వరకూ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కంచుకోటగా కనిపించిన ఢిల్లీ పయనం ఎటు? స్థానికంగానేగాక దేశ రాజకీయాల్లోనే కొత్త మలుపుగా ఏర్పడిన కొద్ది కాలంలోనే అధికార పార్టీగా మారి ఆ పైన పంజాబ్‌కూ విస్తరించిన తొలి ప్రాంతీయ పార్టీగా ఆప్ ఇక్కడ తన పట్టు నిలబెట్టుకుంటుందా? ఒక దశలో జాతీయ ప్రత్యామ్నాయంగా ప్రచారమై తర్వాత సిబిఐ, ఇ.డి కేసులలో వరుసగా సవాళ్లనెదుర్కొని పదవిని కూడా వదులుకున్న అరవింద్ కేజ్రీవాల్ ఇతర నాయకుల ప్రభావం ఇప్పుడెలా వుంటుంది? కేంద్ర పాలిత ప్రాంతంగా వుంటూనే రాష్ట్ర హెూదా పొందిన ప్రత్యేక రాజ్యాంగ నిబంధనల కింద అటు మోడీ ప్రభుత్వ చెలగాటాలకు కొట్టుమిట్టాడే ఎన్‌సిఆర్‌డి (నేషనల్ క్యాపిటల్ రీజియన్-ఢిల్లీ) ప్రతిపత్తి నిలబడుతుందా? ఈ కాలంలో సుప్రీంకోర్టు ఇచ్చిన స్పష్టమైన తీర్పుల స్ఫూర్తి నిలబడేలా ప్రజల తీర్పు రావడానికి ఏం చేయాలి? ఇవన్నీ ఈ ఎన్నికలలో కీలక ప్రశ్నలుగా వున్నాయి.




### ఆప్ తొలి అడుగులు

1952లో ఏర్పడిన ఢిల్లీ అసెంబ్లీ అనేక మలుపులు చూసింది. 1956లో దాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా నేరుగా రాష్ట్రపతి ఆధ్వర్యంలోకి మార్చారు. మంత్రివర్గాన్ని, శాసనసభను రద్దు చేసి మునిసిపల్ కార్పొరేషన్‌గా చేశారు. పదేళ్ల తర్వాత 1966లో ఢిల్లీకి నిర్ణయాధికారాలు లేని మెట్రోపాలిటన్ కౌన్సిల్‌గా మార్చారు. ఆ కౌన్సిల్‌గా వున్నంత కాలం అప్పటి జనసంఘం, బిజెపి/ఆరెస్సెస్‌ల ఆధిపత్యమే నడుస్తుండేది. వాజ్‌పేయి, రాజేశ్ ఖన్నా, సిఎం స్టీఫెన్ వంటి హేమాహేమీలు పోటీ చేస్తుండేవారు. 1991లో 69వ రాజ్యాంగ సవరణ ద్వారా మళ్లీ అసెంబ్లీని తీసుకురావడమే గాక ఎన్‌సిఆర్‌డిగా ప్రకటించారు. 1993 ఎన్నికల్లో బిజెపి గెలిచాక మదన్‌లాల్ ఖురానా, తర్వాత సాహెబ్ సింగ్ వర్మ బిజెపి ముఖ్యమంత్రులుగా పనిచేశారు. ఖురానా అవినీతి ఆరోపణల్లో దిగిపోయాక వచ్చిన వర్మ కూడా విమర్శలపాలు కావడంతో ఆఖరి అస్త్రంగా సుష్మా స్వరాజ్‌ను కొద్ది వారాల ముఖ్యమంత్రిని చేశారు. కానీ కాంగ్రెస్ సీనియర్ షీలా దీక్షిత్ ముందు స్వరాజ్ తట్టుకోలేకపోయారు. 1998 నుంచి 2013 వరకూ షీలా దీక్షిత్ అప్రతిహతంగా పాలించారు. అయితే కాంగ్రెస్ యుపిఎ2 వరుస కుంభకోణాల కేసులలో చిక్కిపోయాక అంతా తలకిందులైంది. సరిగ్గా ఆ అవినీతిపై పోరాటంలో అన్నా హజారేతో కలసి పనిచేసిన అరవింద్ కేజ్రీవాల్ మరికొందరు విద్యాధిక నేతలతో, మాజీ అధికారులతో కలసి ఆప్ స్థాపించారు. పౌర సమస్యల పరిష్కారం, అవినీతి నిర్మూలన వాగ్దానాలతో ప్రజల్లోకి చొచ్చుకెళ్లారు. 2013లో 28 స్థానాలతో ఆప్ పెద్ద పార్టీగా వచ్చింది. కాంగ్రెస్ 13 స్థానాలు పొందింది. కాంగ్రెస్ ఆలస్యంగా ఆప్‌కు మద్దతు ప్రకటించినా కేజ్రీవాల్ 49 రోజుల్లోనే రాజీనామా చేశారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి ఘన విజయం సాధించినా 2015లో జరిగిన శాసనసభ ఎన్నికలకు వచ్చేసరికి ఆప్ 70లో 67 సీట్లు గెలుచుకుని విజయ దుందుభి మోగించింది. కాంగ్రెస్‌కు ఒక్క స్థానం రాకపోగా బిజెపి మూడు సీట్లకు పరిమితమైంది. ఆప్ పాలనలో కొన్ని లోపాలు, అస్పష్టతలు వున్నా బిజెపి, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయంగా ప్రజల మద్దతుతో 2020లో మళ్లీ విజయం సాధించగలిగింది. కాకపోతే ఈ సారి 62 స్థానాలకు పరిమితమవగా బిజెపి బలం పెంచుకుంది. కాంగ్రెస్ ఎంత హడావుడి చేసినా ప్రజల ఆదరణ పొందలేకపోయింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం ఆధిక్యత సాధించిన బిజెపి మరీ ముఖ్యంగా ప్రధాని మోడీ ఢిల్లీని కైవశం చేసుకోవడానికి అన్ని అస్త్రాలు ప్రయోగించారు. పైగా ఈలోగా 2022లో పంజాబ్‌లోనూ ఆప్ అధికారంలోకి రావడం వారికి మరింత కంటగింపుగా మారింది.

# రూ.15 లక్షల వరకూ నో టాక్స్!

ప్రజా స్వేచ్ఛ

**బడ్జెట్లో పన్ను చెల్లింపుదార్లకు ఊరట?**

మధ్యతరగతి పన్ను చెల్లింపుదార్లకు భారీ ఊరటనిచ్చేదిశగా అదాయపు పన్ను రేటును తగ్గించే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నదని సమాచారం. ఈ ప్రతిపాదన ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్పించే బడ్జెట్లో చోటుచేసుకుంటే రూ. 15లక్షల ఆదాయం వరకూ పన్ను చెల్లించనక్కర్లేదని ప్రభుత్వ వర్గాలు సూచనాప్రాయం గా వెల్లడించాయి.దేశంలో మందగించిన వినియోగాన్ని పునరుద్ధరించేదిశగా వినియోగదారుల చేతుల్లో మరింత మిగులు నిధుల్ని ఉంచేందుకు పన్ను తగ్గింపు ప్రతిపాదనను 2025 బడ్జెట్లో ప్రకటించే అవకాశం ఉన్నదని ఆ వర్గాలు వివరించాయి.

**కొత్త పన్ను విధానంలోనే మార్పులు**

ప్రస్తుతం వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులకు రెండు రకాల పద్ధతులు అమలవుతు న్నాయి. ఎప్పటి నుంచో అమల్లో ఉన్న పాత పన్ను విధానానికి తోడు 2020 సంవత్సరంలో కొత్త పన్ను విధానాన్ని ప్రవేశపెట్టారు. పాత పన్ను విధానంలో ఆదాయపు పన్ను రిటర్న్లు సమర్పించేవారికి పలు మినహాయింపులు, రిబేట్లు లభిస్తాయి.కొత్త ట్యాక్స్ రీజీమ్‌లో చాలావరకూ మినహాయింపులు ఉండవు. కానీ పన్ను రేట్లు తక్కువ. ఈ కొత్త పన్ను విధానం ప్రకారం రూ.3 లక్షల నుంచి రూ.10.5 లక్షల వరకూ 5 శాతం నుంచి 15 శాతం వరకూ పన్ను రేట్లు ఉన్నాయి. అంతకు మించిన ఆదాయంపై ఆయా శ్లాబ్‌ల్ని బట్టి 20 శాతం, 30 శాతం పన్ను రేట్లు అమలవుతున్నాయి.అయితే ఈ విధానంలో స్టాండర్డ్ డిడెక్షన్ రూ. 75,000తో కలుకుకుని రూ.7.75 లక్షల ఆదాయంలోపు కలిగినవారికి పూర్తి పన్ను రిబేటు లభిస్తుంది. ఈ రిబేటుతో వారు పన్ను చెల్లించనక్కర్లేదు. కొత్త పన్ను విధానాన్ని అనుసరించేందుకు ప్రోత్సాహకంగా వచ్చే బడ్జెట్లో న్యూ ట్యాక్స్ రీజిమ్‌లో ప్రవేశపెట్టే ప్రతిపాదనతో రూ.15 లక్షల వరకూ ఆదాయం పొందేవారికి పూర్తి పన్ను ఊరట లభిస్తుందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.రేట్ల తగ్గింపు పరిమాణంపై ప్రభుత్వం నిర్ణయం ఇంకా కరారు కాలేదని, బడ్జెట్ తేదీకి దగ్గర్లో నిర్ణయం తీసుకుంటారని తెలిసింది.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**ప్రధాని మోది చెంతకు పన్ను తగ్గింపు ప్రతిపాదన**

అదాయపు పన్ను భారాన్ని తగ్గించాలన్న ప్రతిపాదనను పలువురు ఆర్థిక వేత్తలు ప్రధాన మంత్రి నరేంద్ర మోది చెంత ఉంచారు. ఆదాయపు పన్ను రేట్లు తగ్గించాలని, కస్టమ్స్ సుంకాల్ని హేతుబద్ధీకరించా లని, వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుర్చడానికి చర్యలు తీసుకోవాలని వారు సూచనలు చేశారు. బడ్జెట్ ముందస్తు సంప్రదింపుల్లో భాగంగా ప్రధానితో సమావేశమైన ఆర్థికవేత్తలు వివిధ అం శాలపై వారి అభిప్రాయాలను వివరించారు.

**బేసిక్ పరిమితి రూ.4 లక్షలకు పెంచే ప్రతిపాదన**

కొత్త పన్ను విధానంలో ప్రస్తుతం ఉన్న బేసిక్ మినహాయింపు పరిమితిని రూ.4 లక్షల వరకూ పెంచే ప్రతిపాదనను బడ్జెట్లో ప్రవేశపెడతారని సంబంధిత వర్గాలు తెలిపాయి.అందుకు తగిన రీతిలో ఇతర శ్లాబ్స్‌ను సవరిస్తారని సమాచారం. ఉదాహరణకు 5 శాతం పన్ను శ్లాబ్‌ను రూ.4 లక్షల నుంచి రూ. 7 లక్షలకు పెంచడం ద్వారా రూ. 14 లక్షల ఆదాయం వరకూ జీతభత్యాలు ఆర్జించేవారికి ప్రయోజనం చేకూరుతుంది.ఇతర శ్లాబ్స్‌ను ఇదేరీతిలో ఇతర ప్రతీ శ్లాబ్‌నూ రూ. 1 లక్ష చొప్పున పెంచుతూపోతే పన్ను భారం తగ్గి, వినియోగానికి మరింత సొమ్మును పన్ను చెల్లింపుదార్ల చేతిలో ఉంచాలన్నది ప్రభుత్వ ఆలోచన అని ఆ వర్గాలు వివరించాయి.

## ఉసికెబావి గ్రామంలో హజ్రత్ సయ్యద్ సదుల్లా హుస్సేని షా బాబా దర్గాలో అంగరంగ వైభవంగా ఉర్సు ఉత్సవం

-ప్రత్యేక ప్రార్థనలు చేసిన కాట శ్రీనివాస్ గౌడ్





ప్రజా స్వేచ్ఛ జనవరి 12 పటాన్ చేరు ప్రతినిధి

అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉసికెబావి గ్రామంలో హజ్రత్ సయ్యద్ సదుల్లా హుస్సేని షా బాబా దర్గాలో నిర్వహించిన ఉర్సు ఉత్సవంలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ఈ సందర్భంగా దర్గా కమిటీ నిర్వాహకులు కాటా శ్రీనివాస్ ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్



ప్రజా స్వేచ్ఛ జనవరి 12 ఘట్కేసర్ ప్రతినిధి

మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులను ఘట్కేసర్ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.శనివారం రోజు యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం పై కాంగ్రెస్ పార్టీ వారు చేసిన దాడిని నిరసిస్తూ ఘట్కేసర్ బిఆర్ఎస్ పార్టీ ఆదివారం రోజు ధర్నాకు పిలుపునివ్వడంతో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఘట్కేసర్ మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బండారి శ్రీనివాస్ గౌడ్, ఘట్కేసర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పలుగుల మాధవరెడ్డి,

# తెలంగాణలో సంక్రాంతికి ప్రత్యేక బస్సులు!









హైదరాబాద్: ప్రజా స్వేచ్ఛ

సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్లేందుకు పట్టణ వాసులు సిద్ధమవు తున్నారు. ఈ నేపథ్యంలో పండగ రద్దీని తట్టుకునేం దుకు తెలంగాణ ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తున్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి మరిన్ని సర్వీసులను పెంచాలని అధికారులు నిర్ణయించారు.హైదరాబాద్ నుంచి ఏపీలోని వివిధ ప్రాం తాలకు ప్రయాణికులను తరలించేందుకు ఈ సంక్రాం తికి 5 వేల ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఏపీతోపాటు తెలంగాణ జిల్లాలకూ సంక్రాంతికి ప్రత్యేక సర్వీసులు నడపను న్నారు. సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం య థావిధిగా కొనసాగిస్తారు. అయితే తెలంగాణ రాష్ట్ర సరిహద్దు వరకే జీరో టికెట్ పై ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం వర్తిస్తుంది. ఆ తర్వాత టికెట్ కొనాల్సిందే. పండగకు సంక్రాంతికి వెళ్లే వారు, పండగ తర్వాత తిరిగి హైదరాబాద్ చేరు కునే వరకు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా జన వరి మొదటి వారం నుంచి 17వ తేదీ వరకు పది రోజు లు ఈ ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచను న్నారు. సంక్రాంతి స్పెషల్ బస్సు లకు సంబంధించిన పూర్తి వివరాలను ఆర్టీసీ అధికా రులు శనివారం అధికారి కంగా ప్రకటన చేయను న్నారు.సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే వారి కోసం ఏపీఎస్ ఆర్టీసీ హైదరాబాద్ నుంచి 2,400 ప్రత్యేక బస్సులను నడుపుతోంది. జనవరి 9 నుంచి 13 వరకు సంక్రాంతి ప్రత్యేక బస్సులు అందు బాటులో ఉంటా యని, వీటిని సాధారణ చార్జీలతో ఏపీలోని పలు జిల్లాలకు నడుపుతున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఎల్. విజయలక్ష్మి తెలిపారు. ప్రయాణికులు ఆన్లైన్ ద్వారా, అధీకృత ఏటీబీ ఏజెంట్ల ద్వారా అడ్వాన్సు గా టికెట్లు బుక్ చేసుకోవ చ్చన్నారు.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

# జాతర మహోత్సవాలతో గ్రామాలలో ఆధ్యాత్మిక వాతావరణం





-భానూర్ లో జరిగిన శ్రీ రేణుక ఎల్లమ్మ జాతరలో పాల్గొన్న నీలం మధు ముదిరాజ్,కాట శ్రీనివాస్ గౌడ్

-ఎల్లమ్మ తల్లి అందర్నీ చల్లగా చూడాలి : నీలం మధు ముదిరాజ్

-ఇరువురు కలిసి ఫలహారం బండి ఊరిగింపు ప్రారంభం

ప్రజా స్వేచ్ఛ జనవరి 12 పటాన్ చేరు ప్రతినిధి
జాతర మహోత్సవాలకు గ్రామాల్లో బంధుమిత్రగణంతో అహల్లాదకర వాతావరణం చోటు చేసుకుంటుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ కాటా శ్రీనివాస్ గౌడ్ అన్నారు, ఆదివారం పటాన్చెరు మండలం భానూరు గ్రామంలో గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ రేణుక ఎల్లమ్మ జాతరలో పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ తో కలిసి పాల్గొన్న నీలం మధు ముదిరాజ్, ఈ సందర్భంగా నిర్వాహకులు ఇద్దరు నాయకులతో ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు అనంతరం అందూర్ సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపు వద్ద ఇరువురు నాయకులు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా నీలం మధు, కాట శ్రీనివాస్ మాట్లాడుతూ అమ్మవారు అందరినీ సుఖసంతోషాలతో చూడాలని కోరుకున్నట్లు తెలిపారు, మన సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా ఈ జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహించడం మంచి విషయం అని అన్నారు అనంతరం ముఖ్య అతిథులకు నిర్వాహకులు ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుధాకర్ గౌడ్, శ్రీశైలం, పాటి గోపాల్ యాదవ్, శివానందం, గోరేమియ, వి నారాయణ రెడ్డి, ముత్తంగి అశోక్, బంటు రాములు,నరేందర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, కృష్ణ గౌడ్, ప్రభు గౌడ్, జితేందర్ గౌడ్, సుధాకర్ గౌడ్, మధు, శివ ,మహేష్, జాతర నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సీనియర్ నాయకులు మృతి పట్ల ఎమ్మెల్యే నివాళులు




ప్రజా స్వేచ్ఛ ప్రతినిధి రామన్నపేట జనవరి 12
కాంగ్రెస్ పార్టీకి చెందిన రామన్నపేట పట్టణంలో సాయికుమార్ తండ్రి లవణం చంద్రమౌళి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందడంతో విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదివారం భౌతికకాయాన్ని సందర్శించి పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మహమ్మద్ జమీరొద్దీన్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బట్టే సంతోష్,నాయకులు జినుకల ప్రభాకర్,గోదాసు పృథ్వీరాజ్, వనం చంద్రశేఖర్ ఎండి నాసర్ జెల్లా వెంకటేష్,రామిని రమేష్,ఎండి అక్రమ్, సాల్వేరు లింగం,గొలుసుల ప్రసాద్ కొమ్ము శేఖర్,పల్లపు రవి,ఎండి జానీ చిత్తరంజన్ దాస్ మున్సి గంగాపురం శంకర్ కేశవదాస్ ఉదయ్ గుంటి శీను తదితరులు పాల్గొన్నారు

## యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పటాన్చెరు లో ఘనంగా స్వామి వివేకానంద జయంతి




ప్రజా స్వేచ్ఛ జనవరి 12 పటాన్ చేరు ప్రతినిధి
పటాన్చెరు సనాతన ధర్మాన్ని యావత్ ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. స్వామి వివేకానంద 162వ జయంతినీ పురస్కరించుకొని గురువారం పటాన్చెరు పట్టణంలోని ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ స్వామి వివేకానంద తన ప్రసంగాల ద్వారా యువతలో స్ఫూర్తి నింపడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా భారతదేశ గొప్పతనాన్ని చాటి చెప్పారని కొనియాడారు. ఆయన పుట్టిన రోజును దేశ వ్యాప్తంగా జాతీయ యువజన దినోత్సవంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, అఫ్జల్, వంగరి అశోక్, వెంకటేష్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సేవ నాయకుడు మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు

-కాంగ్రెస్ నేత మహమ్మద్ ఇబ్రహీం



ప్రజా స్వేచ్ఛ జనవరి 12 షాద్ నగర్ ప్రతినిధి
నిండు నూరేళ్లు,అష్ట ఐశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, ప్రతినిత్యం ప్రజల్లో ఉండే నాయకుడు రంగారెడ్డి జిల్లా షాదనగర్ నియోజకవర్గం కొత్తూరు మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డిని శాలువా, పూలమాలతో సత్కరిస్తూ జననేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ ఇబ్రహీం తదితరులు.

## ఘనంగా స్వామి వివేకానంద జయంతి



ప్రజా స్వేచ్ఛ జనవరి 12, మెదక్ జిల్లా ప్రతినిధి (రాము)
కొల్చారం మండలం రంగంపేట గ్రామంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా కొల్చారం మండలం బిజెపి శాఖ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం ఘనంగా జరుపుకోబడింది. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ఘనపురం హరీష్, కిసాన్ మోర్చా అధ్యక్షులు పల్లె రవికాంత్, ఎస్టి మోర్చా అధ్యక్షులు పూల్ సింగ్, రంగంపేట బూత్ అధ్యక్షులు గంగరాజు, బొద్దుల సాయి, ఏనుగండ్ల బూత్ అధ్యక్షులు మంగళ్ లింగం, సంగాయిపేట బూత్ అధ్యక్షులు ఆకుల ఆంజనేయులు, మండల సీనియర్ నాయకులు గిరి, వెంకట్, వడ్ల భాను చారి, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్ జి కే లో శాంతి యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు

-ముగ్గుల పోటీల్లో భారీ ఎత్తున పాల్గొన్న కాలనీ మహిళలు

-ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేసిన కౌన్సిలర్ లు మెట్టు బాల్ రెడ్డి, సింగిరెడ్డి సాయిరెడ్డి



ప్రజా స్వేచ్ఛ జనవరి 12 పోచారం మున్సిపాలిటీ
మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ రాజీవ్ గృహకల్ప లో ఆదివారం రోజు శాంతి యూత్, వ్యవస్థాపక అధ్యక్షులు, పోచారం బీఆర్ఎస్ పార్టీ యూత్ వింగ్ అధ్యక్షులు కొమ్ముల ప్రశాంత్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా ఆరో వార్డ్ కౌన్సిలర్ సింగిరెడ్డి సాయిరెడ్డి, 9వ వార్డు కౌన్సిలర్ మెట్టు బాల్ రెడ్డి, పోచారం మాజీ ఉపసర్పంచ్ ఆకిటి బాల్ రెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలలో భాగంగా మహిళలు ఇంత పెద్ద ఎత్తున ముగ్గుల పోటీల్లో పాల్గొనడం అభినందనీయమని, అన్ని రంగాలలో కూడా ఆర్జీకే యువత పోటీపడుతూ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని వారన్నారు అదేవిధంగా కాలనీవాసులకు అందరికీ భోగి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో శాంతి యూత్ అధ్యక్షులు రవీందర్, వైస్ ప్రెసిడెంట్ సతీష్, శ్రీకాంత్, సాయి సంపత్, రవి ,మహేష్, మహేష్,అఖిల్,సురేష్ కాలనీవాసులు నాయకులు, కొమ్మిడి శ్రీనివాస్ రెడ్డి, ఏదుల్ల శ్రీను గౌడ్ ,చందర్, మాజీ వార్డు సభ్యురాలు రాస మల్ల విమల గణేష్,ఐద్వా అధ్యక్షురాలు అరుణ ,నాగమణి,ఉమా, తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న మొమిన్ రోషన్ జమీర్,



ఎల్బీనగర్ ప్రజా స్వేచ్ఛ
మొమిన్ రోషన్ జమీర్, అడ్వకేట్, స్టేట్ జనరల్ సెక్రటరీ మరియు సోషల్ మీడియా ఇంచార్జ్, లీగల్ సెల్ (చట్టం, మానవ హక్కులు మరియు ఆర్టీఐ విభాగం), తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, 2025 జనవరి 12న హైదరాబాద్‌లో మొహమ్మద్ అలీ కుమారుడు, ఇంజనీర్ మొహమ్మద్ మెహబూబ్ అలీ మరియు అడ్వకేట్ షేక్ మొహమ్మద్ ఫయాజ్ సోదరుడి వివాహ రిసెప్షన్‌లో పాల్గొన్నారు. ఈ రిసెప్షన్‌లో షోయబ్ అడ్వకేట్, సాజిద్ భాయ్ మరియు ఇతరులు కూడా హాజరయ్యారు.

## సర్దార్ సర్వాయి పాపన్నకు 92 వ వారం నిత్యపూల మాలా కార్యక్రమం






ప్రజా స్వేచ్ఛ జనవరి 12 ఘట్కేసర్ ప్రతినిధి
సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ నిత్య పూలమాల కార్యక్రమం 92వ వారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా మనుపాటి విజయ్ కుమార్ ఎం పి డి వో చేతుల మీదుగా వేయడం జరిగింది. ఎంపీడీవో విజయ్ కుమార్ బషీరాబాద్ మండలం మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న ఆనాడు బలవంతుల పాలనలో బలహీన వర్గాల వారు బాధితులే అని,అజ్ఞానము కమ్ముకున్న ఆ రోజులలో వారి బాధలను గుర్తించి మరియు గౌడ వృత్తి వ్యాపారం చేసుకునే వారి గురించి కూటి కోసము తాటికెళ్ళి కాటికి దగ్గరేచున్న వారిని గుర్తించి సామాజికంగా, ఆర్థికంగా, మరియు రాజకీయ కంగా ఎదగాలని గుర్తించి కొన్ని సంస్థానాలను గెలిచి మన జీవితాలలో వెలుగు నింపే దారి ఎంచుకున్నారని మరియు ఇలాంటి మహనీయులను మర్చిపోకుండా ఉండాలని వారి యొక్క వీర గాధలను ఇప్పుడు ఉన్న పిల్లలకు తెలియజేయాలని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం డైరెక్టర్లు బండ్లగూడెం కిషోర్ గౌడ్, బీగుడేం పాండు గౌడ్ వాకర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సారా శ్రీనివాస్ గౌడ్,పల్లె విజయ్ గౌడ్, గోపాల్ గౌడ్, బీగుడెం బాలకృష్ణ గౌడ్, అక్తర్ భాయ్,ఆముదాల శ్రీనివాస్ గౌడ్, కౌకూరి రవికాంత్ ముదిరాజ్,ఎస్ శ్వేత మహేశ్ రెడ్డి, బిందు నవీన్, లక్ష్మి హరినాథ్,పాల్గొనడం జరిగింది.

## ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



ప్రజా స్వేచ్ఛ జనవరి 12సైదాబాద్ ప్రతినిధి
సేఫ్ ఫౌండేషన్ మరియు దళిత మహిళా సంఘం ఆధ్వర్యంలో శంఖేశ్వర్ బజార్ కాలనీలో ముగ్గుల పోటీలు ఘనంగా జరిగాయి. ఈ ముగ్గుల పోటీలకు అధిక సంఖ్యలో మహిళలు,విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని వివిధ రకాల ముగ్గులతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సైదాబాద్ కార్పొరేటర్ కొత్తపల్లి అరుణ రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండగ మన సంస్కృతికి,సంప్రదాయానికి ప్రతీకా, మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని కోరారు. ముగ్గుల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ప్రథమ,ద్వితీయ,తృతీయ బహుమతులుగా పావని, పద్మావతి,మేఘన గెలుపొందడం జరిగింది. ఈ కార్యక్రమంలో సేఫ్ ఫౌండేషన్ బృందం,శ్రీను,పావని, నాగరాజ్,మమత,గణేష్,లలిత,కృష్ణ తదితరులు

# బిజినెస్

# రూపాయి పతనం ఎఫెక్ట్.. విమాన టికెట్ల ధరలు పైపైకి.. తేల్చి చెప్పిన ఎయిర్ ఇండియా..!

ఫారెక్స్ మార్కెట్లో యూఎస్ డాలర్ మీద రూపాయి మారకం విలువ పతనం కావడంతో తమ కాస్ట్ స్ట్రక్చర్ మీద, కంపెనీ లాభాల మీద ఒత్తిడి పెంచుతున్నది. దీనివల్ల విదేశీ కరెన్సీలో ఎయిర్ ఇండియా విమాన టికెట్ల ధరలు పెరుగుతాయని కంపెనీ యాజమాన్యం తెలిపింది. ఇటీవలి కాలంలో ఈ నెల పదో తేదీన ఫారెక్స్ మార్కెట్లో అమెరికా డాలర్పై రూపాయి మారకం విలువ రూ. 86.04లకు పతనమైంది. రూపాయి బలహీనంతో అన్ని విమానయాన సంస్థల నిర్వహణా ఖర్చులు ఎక్కువవుతాయి. రూపాయి మారకం విలువ మరింత పతనం కావడంతో విమానయాన పరిశ్రమకు, ఎయిర్ ఇండియాకు సవాల్‌గా పరిణమిస్తుందని సంస్థ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ నిపున్ అగర్వాల్ చెప్పారు. అయితే, భారం తగ్గించుకునేందుకు ఇతర చర్యలు చేపడతామన్నారు. మరింతగా రూపాయి మారకం విలువ పతనమైతే కంపెనీ లాభాలపై ప్రభావం పడుతుందన్నారు. దేశీయంగా ఎయిర్ఇండియా గ్రూప్ ప్రతి రోజూ 1168 విమాన సర్వీసులు నడుపుతోంది. వాటిల్లో 313 అంతర్జాతీయ విమాన సర్వీసులు ఉన్నాయి. విదేశీ విమాన సర్వీసుల్లో 244 షార్ట్ హాల్, మిగతా 69 లాంగ్ హాల్ కేంద్రాలని తెలిపారు. ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్ ఇటీవలే విలీనం అయ్యాయి. గతేడాది ఎయిర్ ఇండియాలో విస్తారా ఎయిర్ లైన్స్, ఏఐఎక్స్ కనెక్ట్ విలీనం అయ్యాయి.




## దూసుకుపోతున్న ఎల్ఐసీ


### -2024లో 15 శాతం వృద్ధిని సాధించిన సంస్థ




ప్రభుత్వరంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ) దూసుకుపోతున్నది. ప్రైవేట్ బీమా సంస్థల నుంచి పోటీ తీవ్రతరమైనప్పటికీ అధిక వృద్ధిని సాధిస్తున్నది. 2024 సంవత్సరంలో నూతన బిజినెస్ ప్రీమియం వసూళ్లలో ఎల్ఐసీ 14.64 శాతం వృద్ధిని సాధించింది. లైఫ్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం ఈ విషయాన్ని వెల్లడించింది. బీమా రంగ ఇండస్ట్రీ 14.41 శాతం వృద్ధిని సాధించగా, ప్రైవేట్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలు 14.55 శాతం వృద్ధి కనబరిచాయి. గడిచిన 12 నెలల్లో ఎల్ఐసీ రూ.2,33, 073.36 కోట్ల ప్రీమియం వసూళ్లు జరపగా, క్రితం ఏడాదిలో రూ.2,03,303 కోట్లుగా ఉన్నాయి. మొత్తంమీద లైఫ్ ఇన్సూరెన్స్ ఇండస్ట్రీ రూ.4,02,773.18 కోట్ల మేర ప్రీమియం కలెక్షన్లు జరిపాయి. దీంట్లో ప్రైవేట్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలు రూ.1,69,699.83 కోట్ల మేర ప్రీమియం వసూళ్లు చేశాయి. 2023లో వసూలు చేసిన రూ.1,48,323.21 కోట్లతో పోలిస్తే 14.41 శాతం అధికమని పేర్కొంది. దీంట్లో ఇండివిజ్యువల్ ప్రీమియం వసూళ్లలో ఎల్ఐసీ 4.92 శాతం వృద్ధిని సాధించింది. రూ.58, 486.69 కోట్ల నుంచి రూ.61,365.75 కోట్లకు పెరిగాయి. గడిచిన సంవత్సరంలో ఎల్ఐసీ 1.96 కోట్ల పాలసీలు, స్కీంలను జారీ చేసింది. అంతక్రితం ఏడాది విక్రయించిన 2.01 కోట్ల పాలసీలతో పోలిస్తే 2.72 శాతం తగ్గాయి.

## ఎఫ్‌డీలపై 8.55% వడ్డీ

సీనియర్ సిటిజన్లకు ఏడాది కాలపరిమితి కలిగిన ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)పై ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులు అత్యధిక వడ్డీరేట్లనిస్తున్నాయి. మొదట్నుంచీ మదుపరులకు సురక్షిత పెట్టుబడి సాధనంగా ఎఫ్‌డీలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే సీనియర్ సిటిజన్ల పెట్టుబడులకు ఇవిప్పుడు చక్కని లాభసాటి మార్గంగా నిలుస్తున్నాయి. పైగా సెక్షన్ 80టీటీబీ కింద ఏ బ్యాంక్ డిపాజిట్ల ద్వారా పొందిన వడ్డీ ఆదాయంపైనైనా గరిష్ఠంగా పన్ను మినహాయింపును పొందే అవకాశం సీనియర్ డిపాజిటర్లకున్నది. ఏటా రూ.50వేలదాకా లబ్ధి పొందవచ్చు. ఇక కొన్ని బ్యాంకులు మెచ్యూరిటీ కంటే ముందే డిపాజిట్లను ఉపసంహరించుకున్నా ఎలాంటి జరిమానాలు వేయడం లేదు. రూ.5 లక్షల వరకుండే డిపాజిట్లకు బీమా సదుపాయం కూడా ఉంటుందన్న విషయం తెలిసిందే. డిపాజిట్ చేసిన బ్యాంకులు దివాలా తీస్తే ఈ ప్రయోజనం వర్తిస్తుంది.ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో..




**బ్యాంక్ వడ్డీరేటు(%)**

ఇండియన్ ఓవర్‌సీస్ 7.60
బ్యాంక్ ఆఫ్ బరోడా 7.35
కెనరా 7.35
సెంట్రల్ బ్యాంక్ 7.35
బ్యాంక్ ఆఫ్ ఇండియా 7.30
పీఎన్‌బీ 7.30
ఎస్బీఐ 7.30
యూనియన్ బ్యాంక్ 7.30
ఇండియన్ బ్యాంక్ 6.60
ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో..


## ఐపీఎల్ 2025 సీజన్‌పై కీలక ప్రకటన చేసిన రాజీవ్ శుక్లా..!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 సీజన్‌పై బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా కీలక సమాచారం అందించారు. ఈ ఏడాది ఐపీఎల్ సీజన్ ఆలస్యంగా ప్రారంభమవుతుందని వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం మార్చి 14న ప్రారంభం కావాల్సి ఉండగా.. ఆలస్యంగా మార్చి 23 నుంచి ప్రారంభవుతుందని, మే 25న ఫైనల్ ఉంటుందని పేర్కొన్నారు. అయితే, ప్లేఆఫ్, ఫైనల్ మ్యాచ్ తేదీలపై ఎలాంటి ప్రకటన చేయలేదు. కొత్త షెడ్యూల్‌కు సంబంధించిన పనులు త్వరలోనే షురూ కానున్నాయి. బీసీసీఐ ప్రత్యేక సమావేశం జరిగింది. ఇందులో ఐపీఎల్ 18వ ఎడిషన్ ప్రారంభంపై చర్చించారు. లీగ్‌లో మొదటి మ్యాచ్‌ను ఏ జట్లు ఆడతాయనే దానిపై ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఒకే ఎజెండాతో సమావేశం జరిగిందని.. అది కార్యదర్శి నియామకానికి సంబంధించిందేనన్నారు. ఈ సందర్భంగా ఐపీఎల్ కమిషనర్‌ను సైతం ఏడాది కాలానికి యిమించినట్లు తెలిపారు. దాంతో పాటు ఉమెన్స్ ప్రీమియర్ లీగ్‌పై స్పందించారు. లీగ్ వేదికలను నిర్ణయించామని.. త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ముంబయిలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కీలక అంశాలపై చర్చించారు. మళ్లీ ఈ నెల 18, 19న సమావేశం నిర్వహించే అవకాశం ఉంది. భేటీలో ఆస్ట్రేలియా పర్యటనలో టీమిండియా ప్రదర్శనపై సైతం చర్చించినట్లు తెలుస్తున్నది. అలాగే, ఐపీఎల్ విషయంలోనూ చర్చ జరిగింది. ఈ సందర్భంగా మార్చి 14 నుంచి 23కి మార్చారు. అయితే, ఐపీఎల్ తేదీలను ఎందుకు మార్చారన్న విషయంలో స్పష్టత లేదు. ప్రస్తుతం షెడ్యూల్‌ను తయారీ చేస్తుండగా.. త్వరలోనే వివరాలను బీసీసీఐ అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఐపీఎల్ 2025 సీజన్‌కు సంబంధించి ఇప్పటికే మెగా వేలం ముగిసింది. జెడ్డా వేదికగా వేలం నిర్వహించింది. ఈ వేలంలో టీమిండియా ఆటగాడు రిషబ్ పంత్‌కు రూ.27కోట్లకు లక్నో సూపర్ జెయింట్స్ సొంతంచేసుకుంది.




# స్పోర్ట్స్

## ఛాంపియన్స్ ట్రోఫీకి జట్టును ప్రకటించిన బంగ్లాదేశ్..



ఛాంపియన్స్ ట్రోఫీకి బంగ్లాదేశ్ జట్టును ఆదివారం ప్రకటించింది. జట్టుకు నజ్ముల్ హుస్సేన్ శాంటో కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. సీనియర్ ఆల్ రౌండర్ షకీబ్ అల్ హసన్‌కు ఈ జట్టులో చోటు కల్పించలేదు. ఇటీవల బౌలింగ్ యాక్షన్ అనుమానాస్పదంగా ఉన్నది. ఐసీసీ ఎదుట బౌలింగ్ యాక్షన్‌ను నిరూపించుకునే వరకు బౌలింగ్ చేయలేదు. చెన్నైలోని రామచంద్ర సెంటర్ ఫర్ స్పోర్ట్స్ సైన్స్‌లో నిర్వహించిన పరీక్షల ఆధారంగా 37 ఏళ్ల బౌలర్‌ను ఇంగ్లాండ్, వేల్స్ క్రికెట్ బోర్డు పరిధిలోని పోటీల్లో బౌలింగ్ చేయకుండా సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఇక బంగ్లాదేశ్ జట్టు 2017 ఛాంపియన్స్ ట్రోఫీలో సెమీ-ఫైనల్స్‌కు చేరుకుంది. ఆ జట్టులోని వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ ముష్ఫికర్ రహీమ్, ఆల్ రౌండర్ మహ్మదుల్లా ఉన్నారు. పర్వేజ్ హుస్సేన్ ఎమోన్ తొలిసారి వన్డే జట్టులో చోటు దక్కించుకున్నాడు. అతను ఇప్పటి వరకు కేవలం ఏడు టీ20లు మాత్రమే ఆడాడు. ఇటీవల వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌లో అరంగేట్రం చేసిన ఫాస్ట్ బౌలర్ నహిద్ రాణా కూడా జట్టులో చోటు దక్కించుకున్నాడు.

**బంగ్లాదేశ్ ఛాంపియన్స్ ట్రోఫీ జట్టు**

నజ్ముల్ హుస్సేన్ శాంటో (కెప్టెన్), సౌమ్య సర్కార్, తంజిద్ హసన్, తౌహిద్ హృదయ్, ముష్ఫికర్ రహీమ్, మహ్మదుల్లా, జాకర్ అలీ, మెహదీ హసన్ మిరాజ్, రిషద్ హుస్సేన్, తస్కిన్ అహ్మద్, ముస్తాఫిజుర్ రెహ్మాన్, పర్వేజ్ హుస్సేన్ ఎమోన్, నసుమ్ అహ్మద్, తంజిమ్ హసన్ సాకిబ్, నహిద్ రాణా.

## ఐర్లాండ వన్డేలో అరుదైన ఘనత సాధించిన ఆల్‌రౌండర్ దీప్తి శర్మ..!

రత్-ఐర్లాండ్ వేదికగా మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా రాజ్‌కోట్‌లో ఆదివారం రెండో మ్యాచ్ జరుగుతోంది. ఈ మ్యాచ్‌తో టీమిండియా వుమెన్స్ జట్టు వైస్ కెప్టెన్ దీప్తి శర్మ అరుదైన ఘనత మైలురాయిని సాధించింది. వంద వన్డేలు, వంద టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన రెండో భారత మహిళా క్రికెటర్‌గా నిలిచింది.ఆల్ రౌండర్ దీప్తి తన కెరీర్‌లో 1001వ వన్డే మ్యాచ్‌ను ఆదివారం ఆడింది. ఈ మ్యాచ్‌తో ఆమె రికార్డు సృష్టించింది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తర్వాత వంద టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు, 100 వన్డేలు ఆడిన రెండో వుమెన్ క్రికెటర్‌గా నిలిచింది. దీప్తి ఇప్పటివరకు తన కెరీర్‌లో భారత్ తరపున 124 టీ20 మ్యాచ్‌లు ఆడగా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తన కెరీర్‌లో ఇప్పటివరకు 178 టీ20 మ్యాచులు.. 141 వన్డే మ్యాచ్‌లు ఆడింది. ఈ సందర్భంగా దీప్తి తన క్రికెట్ ప్రయాణంపై మాట్లాడింది. భారత్ తరఫున ఆడాలని కలలు కన్నానని.. టీమిండియాకు ఎంపికైన సమయంలో కంగారుపడ్డానని పేర్కొంది. సీనియర్లంతా కలిసి ఉండాలని అనుకున్నానని.. ఎంత ప్రశాంతంగా.. కంపోజ్‌గా ఉండాలో నేర్చుకున్నానని పేర్కొంది. ఎప్పుడూ బాధ్యతాయుతమైన పాత్ర ఉందని.. తాను ఏ ఆర్డర్‌లోనైనా బ్యాటింగ్ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొంది. 188 పరుగుల ఇన్నింగ్స్ ఆడినప్పుడే అదే నా అతిపెద్ద విజయమని చెప్పింది. క్రికెట్ ఆడుతున్న సమయంలో ఇలాంటిది రికార్డ్ అవుతుందని తాను ఎప్పుడూ అనుకోలేదని తెలిపింది.





# విజయ్ ది గోట్ టీవీలో సందడి చేసే టైం ఫిక్స్..!

డిజిటల్ ప్లాట్‌ఫాంలోనూ మంచి స్పందన రాబట్టుకున్న ఈ మూవీ ఇక టీవీల్లో కూడా సందడి చేసే టైం వచ్చేసింది. ఈ మూవీ నిన్న సాయంత్రం 6:30 గంటలకు జీ తమిళ్‌లో ప్రీమియర్ అయింది. అదేవిధంగా జనవరి 14న పొంగళ్ కానుకగా (మంగళవారం) ఉదయం 11 గంటలకు కూడా ప్రీమియర్ కానున్నట్టు ప్రకటించారు. ఇంతకీ ఈ తేదీ తెలుగు ప్రీమియర్‌కు సంబంధించినదేనా..? అనేది క్లారిటీ రావాల్సి ఉంది. పొలిటికల్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంలో ప్రశాంత్, ప్రభుదేవా, స్నేహ, లైలా, యోగిబాబు మిక్ మోహన్, జయరాం ఇతర కీలక పాత్రల్లో నటించారు. ఈ మూవీని ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రొడక్షన్ బ్యానర్‌పై తెరకెక్కించగా.. యువన్ శంకర్ రాజా మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించాడు కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ నటించిన చిత్రం ది గోట్ . దళపతి 68 గా తెరకెక్కిన ఈ మూవీకి వెంకట్ ప్రభు దర్శకత్వం వహించాడు. మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్ పోషించింది. గతేడాది సెప్టెంబర్ 5న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లు వసూళ్లు చేసింది.

# హాట్ ఫోజులతో హీటెక్కిస్తోన్న వయ్యారి..

తెలుగు సినీ పరిశ్రమలో ఒకప్పుడు పాపులర్ హీరోయిన్. బ్యాక్ టూ బ్యాక్ సినిమాలతో అలరించింది. అతి తక్కువ సమయంలోనే అందం, అభినయంతో తనకంటూ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకున్న ఈ వయ్యారికి.. ఇండస్ట్రీలో సరైన క్రేజ్ మాత్రం రాలేదు. వరుస సినిమాల్లో నటించినప్పటికీ స్టార్ డమ్ మాత్రం అందుకోలేకపోయింది. దశాబ్దకాలంపాటు సినీరంగాన్ని ఏలిన ఈ వయ్యారి.. ఇప్పుడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్. ఎప్పుడూ గ్లామర్ ఫోటోలతో రచ్చ చేసే ఈ బ్యూటీ.. ఇప్పుడు షవర్ కింద స్నానం చేస్తూ ఫోజులకు ఫోజులిచ్చింది. తాజాగా హాట్ ఫోజులతో నెటిజన్స్ మతిపోగొట్టేస్తుంది. ఇంతకీ ఆమె ఎవరో గుర్తుపట్టారా.. ? తనే హీరోయిన్ శ్రద్ధా దాస్. ప్రస్తుతం ఆమె వయసు 37 సంవత్సరాలు.బాంబేకి చెందిన ఈ బ్యూటీ, సిద్ధూ ఫ్రమ్ సికాకుళం ద్వారా వెండితెరపై అడుగుపెట్టింది. ఈ సినిమాతో తెలుగులో మంచి గుర్తింపు రావడంతో.. వరుస ఆఫర్స్ అందుకుంది. తన గ్లామర్ ఉపయోగించుకుని అప్పుడప్పుడు అటు హిందీ సినిమాల్లోనూ నటించింది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం,హిందీ భాషలలో నటించిన ఈ అమ్మడుకు స్టార్ స్టేటస్ మాత్రం రాలేదు. ప్రస్తుతం ఆడపాదడపా చిత్రాల్లో నటిస్తున్న ఈ వయ్యారి.. ఇటు సోషల్ మీడియాలోనూ చాలా యాక్టివ్ గా ఉంటుంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ చూసి ఆశ్చర్యపోతున్నారు ఫ్యాన్స్. షవర్ కింద నిలబడి నీళ్లలో తడుస్తూ ఫోటోలకు ఫోజులిచ్చింది.





# డాకు మహారాజ్ హిట్ అయితే ఈ అమ్మడికి ఢోకా లేనట్టే

శ్రద్ధా శ్రీనాథ్.. మోడల్ గా కెరీర్ ప్రారంభించి ఆతర్వాత హీరోయిన్ గా మారింది ఈ ముద్దుగుమ్మ. శ్రద్ధా శ్రీనాథ్ 2015లో మలయాళంలో వచ్చిన కోహినూర్ సినిమా ద్వారా సినీరంగంలోకి వచ్చింది. 2016లో వచ్చిన కన్నడ చిత్రం 'యూ టర్న్' చిత్రానికి గాను ఆమె ఫిలిం ఫేర్ అవార్డు అందుకుంది. తెలుగులో ఈ చిన్నది నేచరల్ స్టార్ నాని నటించిన జెర్సీ సినిమాతో అడుగు పెట్టింది. తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకుంది. అంతే కాదు నటనపరంగానూ ,మంచి మార్కులు కొట్టేసింది ఈ బ్యూటీ. ఆతర్వాత వరుసగా ఆఫర్స్ అందుకుంది. తెలుగు, తమిళ్, కన్నడ భాషలతో పాటు హిందీలోనూ నటించింది ఈ ముద్దుగుమ్మ. ఇక తెలుగులో జెర్సీ సినిమా తర్వాత కృష్ణ అండ్ హిజ్ లీలా, సైంధవ్ సినిమాల్లో నటించింది. ఎందుకో ఈ అమ్మడికి తెలుగులో పెద్దగా ఆఫర్స్ రాలేదు. తెలుగులో చివరిగా మెకానిక్ రాకీ సినిమాలో మెరిసింది. ఈ సినిమా అంతగా కట్టుకోలేకపోయింది. ప్రస్తుతం బాలకృష్ణ హీరోగా నటిస్తున్న డాకు మహారాజ్ సినిమాలో సెకండ్ హీరోయిన్ గా చేసింది. ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. డాకు మహారాజ్ సినిమా హిట్ అయితే శ్రద్ధా శ్రీనాథ్ క్రేజ్ పెరిగిపోతుంది. అలాగే తెలుగులో ఆఫర్స్ కూడా వరుసగా అందుకుంటుంది, మరి ఈ అమ్మడి కెరీర్ కూడా డాకు మహారాజ్ ఎంతవరకు హెల్ప్ అవుతుందో చూడాలి. ఇక సోషల్ మీడియాలో ఈ చిన్నది చాలా యాక్టివ్ గా ఉంటుంది. గ్లామరస్ ఫొటోలతో ఆకట్టుకుంటుంది.



# హీరోయిన్ ప్రీతి జింటా ఎమోషనల్ పోస్ట్..

ప్రీతి జింటా.. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. రాజకుమారుడు, ప్రేమంటే ఇదేరా సినిమాలతో టాలీవుడ్ ఇండస్ట్రీలో మంచి గుర్తింపు తెచ్చుకుంది. పెళ్లి తర్వాత సినిమాలకు దూరమైన ఆమె.. ఇప్పుడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. తాజాగా నెట్టింట ఎమోషనల్ పోస్ట్ చేసింది. అమెరికాలోని లాస్ ఏంజిల్స్ లో జరిగిన అగ్ని ప్రమాదంపై సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేసింది. ఇలాంటి రోజు చూడాల్సి వస్తుందని తన కలలో కూడా ఊహించలేదని.. తమ పొరుగువారంతా ఇంతకా బాధపడతారని అనుకోలేదంటూ ట్వీట్ చేశారు. అందరూ సురక్షితంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపింది.లాస్ ఎంజిల్స్ లో మా చుట్టూ ఉన్నవారిని మంటలు నాశనం చేసే రోజు వస్తుందని నేను అసలు ఊహించలేదు. నేను బతికుండగా ఇలాంటి విషాదం చూస్తానని అనుకోలేదు. నా స్నేహితులు, కుటుంబాలు ఎంతోమంది నిరాశ్రయులయ్యారు. మన చుట్టూ ఉన్నవారికి జరిగిన విధ్వంసం చూసి నా హృదయం బరువెక్కింది. అక్కడి విధ్వంసం చూస్తుంటే ఎన్నో హృదయ విదాకర దృశ్యాలు చూసి కనిపించాయి. ఈ మంటల్లో సర్వసం కోల్పోయి నిరాశ్రయులైన ప్రజలు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. గాలి త్వరలోనే తగ్గి మంటలు అదుపులోకి వస్తాయని ఆశిస్తున్నాను. వారి ప్రాణాలను కాపాడేందుకు అగ్నిమాపక శాఖ, సిబ్బందితోపాటు ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు. అందరూ సురక్షితంగా ఉండండి" అంటూ పోస్ట్ చేసింది. అమెరికాలోని లాస్ ఎంజిల్స్ లో చెలరేగిన కార్చిచ్చులో వేల ఇళ్లు మంటల్లో బూడిదయ్యాయి. ఈ ఘటనలో దాదాపు 13 మంది మరణించగా.. 12000 కంటే ఎక్కువ ఇళ్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఇదిలా ఉంటే.. ప్రీతి జింటా 2016లో అమెరికాకు చెందిన జీన్ గుడెనఫ్ ను వివాహం చేసుకుంది. అంతకు ముందు చాలా కాలం పాటు ప్రేమలో ఉన్న వీరిద్దరి రహస్యంగా పెళ్ళి చేసుకున్నారు. ఆ తర్వాత సరోగసీ ద్వారా ఇద్దరు కవలలకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తన భర్త, పిల్లలతో కలిసి లాస్ ఎంజిల్స్ లో ఉంటుంది. చాలా కాలం తర్వాత సన్నీ డియోల్ హీరోగా నటించిన లాహోర్ 1947 చిత్రంలో నటిస్తుంది.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492